## శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్న కేంద్ర మంత్రి



లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుంటున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రఘునందన్‌రావు

**వర్గల్, ఫిబ్రవరి 25 (ప్రభాతవార్త):** మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నాచగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావుతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు లక్ష్మీనృసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట



వార్త

## విద్యుదాఘాతంతో యువకుడు మృతి

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** కరెంట్ షాక్‌తో యువకుడు మృతి చెందిన సంఘటన సిద్దిపేటలో ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యప్రదేశ్‌కు చెందిన యువకుడు రాజు లిలరే(26) సిద్దిపేట పట్టణంలోని మెదక్ రోడ్‌లో ఓ ప్రైవేటు వెంచర్‌లో అపార్ట్‌మెంట్ నిర్మాణంలో కూలీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రకటనల కోసం ఏర్పాటు చేసిన ఎల్ఈడీ లైట్లతో కూడిన హైడ్రోజన్ బెలూన్‌ను గాలిలో ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి వీచిన గాలికి హైడ్రోజన్ బెలూన్ తెగి పక్కనే ఉన్న 220 కెవి హైటెన్షన్ వైర్లపై పడింది. దీంతో అపార్ట్‌మెంట్ నిర్మాణం పక్కన గుడిసెలో నిద్రిస్తున్న రాజుపై ఎల్ఈడీ వైరు పడడంతో కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. గత నెలలోనే ఎంగేజ్మెంట్ జరిగిందని వచ్చే నెలలో పెళ్లి ఉందని అంతలోనే ఇంత ఘోరం జరిగిందని మృతుని బంధువులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఎల్ఈడీ లైట్ల హైడ్రోజన్ బెలూన్ గాలికి హైటెన్షన్ వైర్లకు తగలడంతో కాలనీలోని కొందరి ఇండ్లలో టీవీలు, రిఫ్రిజిరేటర్లు, ఫ్యాన్లు షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయినట్లు సమాచారం.



కేతకిఆలయాన్నిదర్శించుకున్న మహారాష్ట్ర న్యాయమూర్తి శంకర్‌పాటిల్

## కేతకి ఆలయాన్ని దర్శించుకున్న మహారాష్ట్ర న్యాయమూర్తి

**ఝరాసంగం, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని పార్వతీదేవితో కొలువుండి భక్తులచే నిత్య పూజలందుకుంటున్న శ్రీకేతకి సంగమేశ్వరస్వామి ఆలయాన్ని ఆదివారం మహారాష్ట్ర న్యాయమూర్తి ఓం శంకర్‌పాటిల్ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న న్యాయమూర్తిని అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలోని అమృతగుండంలో న్యాయమూర్తి పాదప్రక్షాళణ చేసుకుని అర్చకులు మంత్రాలు వల్లిస్తుండగా న్యాయమూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు న్యాయమూర్తి ఓం శంకర్‌పాటిల్‌కు ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందించి సన్మానించారు. కార్యక్రమంలో అర్చకులు దిలీప్ కుమార్ జోషి, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## బెల్టు షాపులు వద్దు-మద్యపాన నిషేధమే ముద్దు

**-ఎక్సైజ్ అధికారులతో హద్నూర్ యువకులు**



ఎక్సైజ్ అధికారికి వినతిపత్రం అందచేస్తున్న హద్నూర్ యువకులు

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** గ్రామంలో గల్లీకో బెల్టు షాపు (గ్రామంలో 15 బెల్టు దుకాణాలు) కొనసాగుతుండటంతో గ్రామంలో మద్యం ఏరుపై పారుతోందని మండలంలోని హద్నూర్ గ్రామ యువకులు నారాయణఖేడ్‌లోని ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదుచేశారు. యువకులు అందచేసిన ఫిర్యాదు పత్రం ప్రకారం...గ్రామంలో రౌండ్ ద క్లాక్‌గా మద్యం అమ్మకాలు యదేశ్చగా కొనసాగుతున్నాయని, ఫలితంగా యువకులు మద్యంమత్తులో జోగుతూ సంసారాలను పాడు చేసుకుంటున్నారని విచారం వ్యక్తం చేశారు. నూరేళ్ల నిండు ప్రాణాలు మద్యంకు బానిసై ఆరోగ్యాలను పాడుచేసుకుని 40 ఏండ్ల లోపే ఎందరో గ్రామ యువకులు ప్రాణాలు కోల్పోయారని, వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో అక్రమంగా కొనసాగుతున్న బెల్ట్ షాపులను మూసేయాలని, గ్రామంలో మద్యం అమ్మకాలు కొనసాగకుండా చూడాలని గ్రామస్థులు తీర్మానం చేసుకుని అధికారులకు ఈ మేరకు వినతిపత్రం అందచేశారు. అక్రమంగా బెల్టు షాపులు నిర్వహిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండికొట్టడమేకాకుండా యువత ఆరోగ్యాలు అణగారి పోతున్నాయని, అందుకు గ్రామంలో మద్యం అమ్మకాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ యువకులు అధికారులకు వినతి చేశారు.

## జాతీయ అవార్డు పొందిన కౌన్సిలర్‌కు సన్మానం



కౌన్సిలర్‌ను సన్మానిస్తున్న నాయకులు

**హుస్నాబాద్, ఫిబ్రవరి 25,ప్రభాతవార్త :** హుస్నాబాద్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్, కౌన్సిలర్ చిత్తారి పద్మ ఇటీవల బహుజన సాహిత్య అకాడమి ఆధ్వర్యంలో తిరుపతిలో జరిగిన అకాడమి జాతీయ సదస్సులో జాతీయ ఉత్తమ కౌన్సిలర్ అవార్డు పొందిన సందర్భంగా ఆదివారం రోజున స్ఫూర్తి అసోసియేషన్ పక్షాన నాయకులు వారిని ఘనంగా సత్కరించారు.కౌన్సిలర్‌గా వారి సేవలను మంచి గుర్తింపు ఈ అవార్డు ద్వార దక్కిందన్నారు.కౌన్సిలర్‌గా వారు చేస్తున్న సేవా కార్యక్రమాలే వారికి జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిందన్నారు.ఈ కార్యక్రమంలో పందిల్ల శంకర్,టిపిసిసి సభ్యులు కేడం లింగమూర్తి,అయిలేని శ్రీనివాస్‌రెడ్డి,మహేష్,వీరేశంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ నూతన భవన ప్రారంభోత్సవం మరోసారి వాయిదా

**కొల్చారం, ఫిబ్రవరి 25,ప్రభాతవార్త:** కొల్చారం మండల పరిషత్ నూతన కార్యాలయ భవన ప్రారంభోత్సవం మరోసారి వాయిదా పడింది. సోమవారం నూతన భవనాన్ని ప్రారంభించడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సర్వం సిద్ధం చేశారు. అనివార్య కారణాల వల్ల చివరి క్షణంలో భవన ప్రారంభోత్సవం వాయిదా పడింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలోనే నూతన భవనాన్ని ప్రారంభించాలని అప్పట్లో కూడ అధికారులు, ప్రజాప్రతినిధులు అన్ని సిద్ధం చేశారు. ఎన్నికల హడావిడి, ఎలక్షన్ కోడ్ రావడంతో అప్పట్లో కూడ ప్రారంభోత్సవాన్ని వాయిదా వేశారు. త్వరలో ఇంచార్జి మంత్రి కొండా సురేఖ, స్థానిక నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు.



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న మండల పరిషత్ నూతన భవనం

# పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి ఒంటరిగానే పోటీచేస్తుంది

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు**

**నర్సాపూర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి ఒంటరిగానే పోటీలు నిలుస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. రాష్ట్రంలోని 17 ఎంపి స్థానాల్లోనూ బిజెపి విజయం సాధిస్తుందని ఆయన తెలిపారు. ఆదివారం నర్సాపూర్‌లోని ఆనంద్ గార్డెన్‌లో బిజెపి విజయ సంకల్ప యాత్రలో భాగంగా ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిర్ఎస్‌తో బిజెపి పొత్తు ఉండదన్నారు. అలాగే ఏపార్టీతోనూ పొత్తు లేకుండా బిజెపి పోటీలో నిలుస్తుందన్నారు. తెలంగాణాలోని 17 ఎంపి స్థానాల్లో బిజెపి విజయం సాధిస్తుందన్నా ధీమాను ఆయన వ్యక్తం చేశారు. అంతేగాక ప్రధాన మంత్రి నరేంద్ర మోడి ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలే బిజెపిని గెలిపిస్తాయన్నారు. మెదక్ ఎంపి స్థానంలో బిజెపి విజయం సాధించి కాషాయం జెండాను ఎగురవేస్తుందని తెలిపారు. అనంతరం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాణి రుద్రమదేవి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడి ఆధ్వర్యంలో ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులవుతున్నారని అన్నారు బిజెపికి ప్రజలు బ్రహ్మారథం పడుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా రానున్న



మాట్లాడుతున్న రఘునందన్‌రావు

పార్లమెంట్‌ఎన్నికల్లో బిజెపి విజయం సాధిస్తుందని, దీంతో ప్రదాని నరేంద్ర మోడి మూడవ సారి ప్రధాన మంత్రి అవుతారన్న దీమాను వ్యక్తం చేశారు. ఎవరు ఎన్ని జిమ్మిక్కులు చేసినా బిజెపి విజయాన్ని ఆపలేరని అన్నారు. కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ బసవ లక్ష్మినర్సయ్య, జిల్లా అద్యక్షులు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీ యాదవ్, రఘువీరారెడ్డి, ఓబిసి రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్ద రమేశ్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోడ రాజెందర్, ఓబిసి జిల్లా అధ్యక్షులు పాపగారి చిన్న రమేశ్‌గౌడ్ కౌన్సిలర్ బుచ్చేష్‌యాదవ్, రమేశ్ యాదవ్, కౌన్సిలర్ యాదగిరి, జిల్లా అధికార ప్రతినిధి కొత్త శ్రీనివాస్‌గుప్త, వెల్మకన్నె రాజెందర్, మాజీ సర్పనంచ్ హెచ్‌వి రమణారావు,నాగేశ్‌గౌడ్, మండల అధ్యక్షులు నీలి నాగేశ్, బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం నిధులను పారదర్శకంగా వినియోగించాలి

**మూడు రోజులపాటు నియోజకవర్గంలో ప్రజాహిత యాత్ర... బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మ శ్రీరాంచక్రవర్తి**

**హుస్నాబాద్, ఫిబ్రవరి 25,ప్రభాతవార్త**

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అందించే నిధులను (వాటాను) మంత్రి, ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ తమ పార్టీ కార్యకర్తలకు కాకుండా ఆ నిధుల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మ శ్రీరాంచక్రవర్తి విజ్ఞప్తి చేశారు. ఆదివారం పట్టణంలోని బిజెపి కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మారుమూల గిరిజనతండాలలో వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని, వెంటనే నీటిఎద్దడి ఉండే ప్రాంతాలను గుర్తించి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్‌చేశారు. భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్‌కుమార్ చేపట్టిన రెండవ విడత ప్రజాహిత యాత్ర నేటి నుండి (సోమవారం నుండి) మూడు రోజుల పాటు హుస్నాబాద్ నియోజకవర్గంలో జరుగనుందని, నిర్వహించబోయే ఈ యాత్ర నేడు కోహెడ మండల కేంద్రం నుండి





మాట్లాడుతున్న బొమ్మ శ్రీరాంచక్రవర్తి

ప్రారంభమౌతుందన్నారు. ఈ యాత్రకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్లమెంట్ ప్రహరీ మీసాల చంద్రయ్య,కన్వీనర్ బోయిన్‌పల్లి ప్రవీణ్‌రావు, అసెంబ్లీ ప్రహరీ గుజ్జ సత్యనారాయణరావు, లక్ష్మారెడ్డి, వేణుగోపాల్‌రావు, అక్కన్నపేట మండల అధ్యక్షులు రామంచ మహేందర్‌రెడ్డి, రూరల్ మండల అధ్యక్షులు రాజేంద్రప్రసాద్‌తో పాటు నాయకులు బొప్పిశెట్టి భీమేశ్వర్, ఆకోజు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న రవీంద్రనాథ్

## బ్యాంకుల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

**యుబిఏఈయు టిఎస్ చైర్మన్ రవీంద్రనాథ్**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

బ్యాంకుల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని యుబిఏఈయు టిఎస్ చైర్మన్ రవీంద్రనాథ్ అన్నారు. సిద్దిపేటలోని టిటిసి భవన్‌లో ఆదివారం నిర్వహించిన యూనియన్ బ్యాంక్ అఫ్ ఇండియా సిద్దిపేట రీజినల్ ఎంప్లాయిస్ యూనియన్ కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ బ్యాంకుల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఖండించాలన్నారు. బ్యాంకులలో పని ఒత్తిడి ఎక్కువగా ఉండడంతో సరైన సంఖ్యలో పర్మనెంట్ ఉద్యోగుల నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి సమద్‌ఖాన్ మాట్లాడుతూ యూనియన్ ఎప్పుడూ సభ్యుల అభివృద్ధికి సంక్షేమానికి కట్టుబడి పని చేయాలన్నారు. ఉద్యోగులకు బ్యాంకు కల్పిస్తున్న ఆరోగ్య బీమా పథకాన్ని అపద సమయంలో వినియోగించుకునేలా వివరించారు. రీజనల్ మేనేజర్ వికాస్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంకు సిద్దిపేట రీజియన్ గత ఏడాది ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సిద్దిపేట రీజియన్‌లోని 63 బ్రాంచ్‌లతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు బ్యాంకు సేవలు అందుబాటులోకి తీసుకరావడం జరిగిందన్నారు. అనంతరం రాబోయే మూడు యేండ్ల కాలానికి సిద్దిపేట రీజియన్‌కు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రీజినల్ కార్యదర్శిగా బోండ్ల శ్రీనివాస్, ఇతర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రాజగోపాల్, ఈశ్వర్, సిద్దులు, వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

## ఫిర్యాదిదారుల సమస్యలను పరిష్కరించాలి ఏసిపి బాలాజీ

**గజ్వేల్, ఫిబ్రవరి 25 (ప్రభాతవార్త):** పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యలు పరిష్కరించాలని గజ్వేల్ ఏసిపి ఏ.బాలాజీ పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్ మండల పరిధిలోని బేగంపేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క దరఖాస్తుకు రిసిప్ట్ ఇవ్వాలని ఏఎస్ఐ రాజుకు సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించి మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ప్రతి రోజూ డాటా ఎంట్రీ చేయాలని సూచించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు నూతన టెక్నాలజీ నేర్చుకోవాలని, విధి నిర్వహణలో చాలా ఉపయోగపడుతుందన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో సిసి కెమెరాల గురించి ఆరాతీశారు. సాధ్యమైనంత త్వరగా ఏదైనా సంఘటన జరిగితే సంఘటనా స్థలానికి త్వరగా చేరుకోవాలని, ఏమైనా సమస్యల ఉంటే త్వరగా పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.





బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఏసిపి బాలాజీ

# అమ్మవారి నామస్మరణతో మార్మోగిన ఏడుపాయల

**పాపన్నపేట, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** ఏడుపాయల వనదుర్గ భవాని మాత ఆలయ పరిసరాలు ఆదివారం భక్తులతో కోలాహలంగా మారాయి. ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయా నికి చేరుకోవడంతో ఆలయ పరిసరాలు అమ్మవారి నామస్మరణతో మార్మోగాయి. భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించి మంజీరా పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారి సన్నిదికి చేరుకుని బోనాలు సమర్పించారు. అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చన పూజలు నిర్వ హించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటి చైర్మన్ సాతెల్లి బాలగౌడ్, ఈఓ మోహన్‌రెడ్డి, సిబ్బంది సూర్యశ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, రవివీర్ కుమార్, ప్రతాప్‌రెడ్డి, తోట నరసింహులు, వరుణాచారి, రాజు, శ్రీకాంత్ తగు ఏర్పాట్లు చేశారు. భక్తులతో ఆలయ అర్చకులు శంకర్‌శర్మ, పార్థివశర్మ, మురళీధర్‌లు వేద మంత్రాలు వల్లిస్తుండగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పరిసరాలను ఎస్ఐ నరేష్ తన సిబ్బందితో నిఘా ఏర్పాట్లు చేశారు.



పూజలు అందుకుంటున్న ఏడుపాయల వనదుర్గ భవాని మాత, అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

**వార్తకు స్పందన**

## జిల్లాలోనే రక్తపరీక్షల కేంద్రం మూసివేత.. అందుకే ప్రైవేట్‌ల్యాబ్‌లో పరీక్షలు

**-హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రమేష్‌రెడ్డి**

**హుస్నాబాద్, ఫిబ్రవరి 25,ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా కేంద్రంలోనే రక్త, మూత్ర మలపరీక్షలతోపాటు ఇతర అవసరమైన పరీక్షలను నిర్వహించే తెలంగాణ హబ్(ప్రభుత్వ ల్యాబ్) మూసివేతలో ఉందని ఇందుకోసమే హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులను ప్రైవేట్‌ల్యాబ్‌లకు పంపించడం జరుగుతుందని ఆదివారం 'ప్రభాతవార్త'లో సర్కార్ దవాఖానాలో ప్రైవేట్ ల్యాబ్‌ల గోల శీర్షికతో ప్రచురితమైన వార్తకు హుస్నాబాద్ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ రమేష్‌రెడ్డి వివరణ ఇచ్చారు. ఈ నేపథ్యంలో రమేష్‌రెడ్డి 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ నిరుపేదలైన రోగులు ఆర్థికభారానికి గురికాకుండా పరీక్షకేంద్రాలవారితో చర్చించి వారు తీసుకునే చార్జీలో సగంకంటే తక్కువనే తీసుకుంటున్నారని వివరించారు. ఇదిలాఉండగా పిహెచ్‌సి పరిధి ఉండగా రిలీఫ్‌ఫండ్ విడుదల అయ్యేదని ఇపుడు మూడేళ్ళుగా రిలీఫ్‌ఫండ్ రావడంలేదని ఒకవేళ విడుదల అయితే తాము ఆ నిధులను రోగులకు కావాల్సిన పరీక్షల నిమిత్తం అందించి ఉండేవారమని వివరించారు. అయితే సాధారణంగా జాండిస్(పసకలు) పుట్టిన పిల్లలకు వారం వరకూ ఉంటుందని దానికి రోజు ఉదయం సూర్యరశ్మికి చూపిస్తే పోయే దానికి ఈ పరీక్షలను పసికందులకు ఎలా చేయిస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు.ఇక ప్రయవేట్ పరీక్షకేంద్రాల విషయం మాత్రం వాస్తవతమేనని దీన్ని అరికట్టాల్సిన బాధ్యత డిహెచ్‌ఎంవో పరిధిలో ఉందని వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రమేష్‌రెడ్డి వివరించారు.





మాట్లాడుతున్న టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి

## మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి

**టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి**

**నర్సాపూర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** పాఠశాలలో ఉపాధ్యాయుల నియామకం కోసం మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని అదే విధంగా ఉపాధ్యాయుల పదోన్నతుల్లో ఉన్న సంక్షోభాన్ని నివారించాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నర్సాపూర్ పట్టణంలోని యాదవ సంఘం పంక్షన్ హాల్‌లో టిఎస్‌యుటిఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షుడు అధ్యక్షతనలో జిల్లా కమిటీ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు.సమావేశానికి ముందు టిఎస్‌యుటిఎఫ్, ఎస్‌టిఎఫ్ఐ పతాకాలను ఆవిష్కరించి అమరులైన సంఘ నాయకులకు నివాళులర్పించారు. అనంతరం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న మూడు కరువు డిఏలను మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం హామీ మేరకు సిపిఎస్ విధానాన్ని రద్దుచేయాలని, పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణకు సిబ్బందిని నియమించాలని కోరారు. మండల కేంద్రాల్లో ప్రస్తుతం ఉన్న ఉన్నత పాఠశాలలను తెలంగాణ పబ్లిక్ స్కూళ్ళుగా అభివృద్ధి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.అనంతరం టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం ముగియబోతున్నందున ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. గురుకులాల్లో కేర్ టేకర్ లను నియమించాలని,కెజిబివి సమగ్రశిక్ష ఉద్యోగులకు బేసిక్ పే ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టిఎస్‌యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మారావు,ఉపాధ్యక్షులు అజయ్, కవిత, కోశాధికారి రవిందర్‌రెడ్డి,ఆడిట్ కమిటీ కన్వీనర్ నాగూల్ మీరా, రాష్ట్ర కమిటీ సభ్యులు విశాలాక్షి, జిల్లా కార్యదర్శులు భీంలా, సుధాకర్, రవి, శేఖర్, శ్రీజ్యోతి, శేఖర్, యేసయ్య, షాకీర్‌అలీ, ఒమేశ్‌రాజు,గంగాధర్, కనకరాజు, భూషణం, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన మల్లన్న ఆలయం



మల్లన్న సన్నిధికి తరలివచ్చిన భక్తజనం

**కొమురవెల్లి, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున్ స్వామి దేవాలయంకు ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో అలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు స్వామి వారికి పట్నాలు వేసి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గుట్టపై ఉన్న అక్క ఎల్లమ్మకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అలయ చైర్మన్ లక్ష్మారెడ్డి, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, ప్రధాన అర్చకులు మల్లికార్జున్, సూపరింటెండెంట్ నీల శేఖర్ తగు ఏర్పాట్లుచేశారు. కార్యక్రమంలో అర్చకులు, ఒగ్గు పూజారులు, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన హరీష్‌రావు



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న హరీష్‌రావు

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** సిద్దిపేట నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలో ఆదివారం పలు బాధిత కుటుంబాలను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు పరామర్శించారు. సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని తడకపల్లిలో బిఆర్ఎస్ యువజన విభాగం సీనియర్ నాయకులు అంబటి మహేష్‌గౌడ్ కూతురు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబీకులను అయన పరామర్శించి ఓదార్చారు. సిద్దిపేట పట్టణానికి చెందిన యువజన విభాగం నాయకులు చేపూరి శేఖర్‌గౌడ్ తండ్రి ఇటీవల గుండె అపరేషన్ చేయించుకోవడంతో శంకర్‌నగర్‌లో పరామర్శించి అరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అయన వెంట పార్టీ నాయకులు రాజనర్సు, మారెడ్డి రవీందర్‌రెడ్డి, కొ ండం సంపత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## పేదలకు ఉచిత వైద్య సేవలు అభినందనీయం

### శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే గాంధీ

వివేకానంద నగర్ కాలనీ, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త : పేద మధ్యతరగతి ప్రజలకు ఉచిత వైద్యం అందించడం అభినందనీయమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఆదివారం వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని కమల ప్రసన్న నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో హోలిస్టిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరంలో స్థానిక కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావుతో కలిసి ఎమ్మెల్యే గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోలిస్టిక్ హాస్పిటల్ వారు ఉచిత పరీక్షలు నిర్వహించడంతోపాటు మందులు పంపిణీ చేయడం వారి సేవా గుణానికి తార్కానమని అన్నారు. కాలనీ వాసులు చుట్టు ప్రక్కల పేద ప్రజలకు రక్త పరీక్షలు, బీపీ, షుగర్, దంతవైద్యం, ఈసీజీ, ఇఎన్టీ, గైనకాలజీ ఆర్తో జనరల్ వైద్యం మొదలగు సేవలు ఒకేచోట ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, వివేకానందనగర్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, పార్టీ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు, నాయినేని చంద్రకాంతరావు, కమల ప్రసన్న నగర్ కాలనీ అధ్యక్షుడు చంద్రశేఖర్, తిరుపతి, శంకర్, బండప్ప, వెంకటేష్, డాక్టర్ శ్వేత, చంద్రశేఖర్‌తో పాటు వైద్య సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

## సాధనతోనే ఉత్తమ ఫలితాలు సాధ్యం

### టిపిసిసి రాష్ట్ర ప్రధాన కారదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి



సాధనాస్ ప్రతిభ వార్శికోత్సవ వేడుకల

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త : నిరంతరం సాధనకు పట్టుదల తోడైతే ఉత్తమ పౌరుల రూపకల్పన సాధ్యమని టిపిసిసి రాష్ట్ర ప్రధాన కారదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. కైసర్‌నగర్‌లోని సాధనాస్ ప్రతిభ పాఠశాల వార్శికోత్సవ వేడుకలను ఉద్దేశించి మాట్లాడారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ప్రవీణ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా నిఖచ్చిగా నిలిచి గెలవడమే సాధన ప్రతిభ పాఠశాల లక్ష్యంగా నివవాలని సూచించారు. తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ మేడ్చెల్ రంగారెడ్డిజిల్లా అధ్యక్షులు రామేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఉత్తమ శిక్షణ వారిలో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకు కృషిచేయాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతకు తల్లిదండ్రుల ప్రోత్సాహంతోడైతేనే ఉత్తమ ఫలితాలు సాధ్యమన్నారు. సమావేశంలో సూరారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, రామేశ్వర్‌రెడ్డి, తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ కుత్బుల్లాపూర్ మండల అసోసియేషన్ ప్రతినిధులు కోల వెంకటేశ్ ముదిరాజ్, వినోద్ జాదవ్, కాయితీ శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, సయ్యద్ ఇమ్రాన్, కైసర్‌నగర్ వార్డు సభ్యులు మసూద్ తదితరులు పాల్గొన్నారు.

## వేంకటేశ్వర ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవ వేడుకలు



బోయిన్‌పల్లిలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న జంపనప్రతాప్ తదితరులు

కంటోన్మెంట్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: హిందువుల ఐక్యత, సంతాన ధర్మ హిందూ ఆచారాలను చాటి చెప్పేందుకు ప్రతి ఒక్కరు పాటుపడాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, బిజెపి మహంకాలి జిల్లా అధికార ప్రతినిధి బి.ఎన్.శ్రీని వాస్ పిలుపు నిచ్చారు. ఆదివారం బోయిన్‌పల్లి న్యూ సిటీ కాలనీలోని శ్రీ వేంకటేశ్వర దేవాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన పిల్లలను కూడా ఆలయాలకు తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించి భక్తి భావాలను పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పవన్ స్వామి, దీపక్ స్వామి, శ్రీధర్ స్వామి, ఆలయ కమిటీ అధ్యక్షులు నారాయణ, కార్యదర్శి లక్ష్మణ్, సభ్యులు జగన్నాథం, రాంమోహన్, సాంబ శివరావ్, నర్సింగ్‌రావ్, పెంటారెడ్డి, యాదయ్య, హన్మంత్ రెడ్డి, సుధీర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించాలి

### ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



చిన్నారులతో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సంజీవరెడ్డి నగర్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: పిల్లలకు చిన్నతనం నుంచే వారికి ఆసక్తి ఉన్న రంగాలలో ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈనెల 16న కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో మెడల్స్ సాధించిన జెక్ కాలనీకి చెందిన చిన్నారులతో ఆదివారం వెస్ట్ మారెడ్‌పల్లిలోని ఎమ్మెల్యే నివాసంలో కోచ్‌లు దేవేందర్, సిరి ఎలిజబెత్‌లు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గోల్డ్‌మెడల్ సాధించిన గుంటూరు మోక్షిక, రిత్విక్, సిల్వర్ మెడల్ సాధించిన మోక్షిత, కార్తిక్, లియోనా, శ్రీయాన్ ఇతర మెడల్స్ సాధించిన చిన్నారులను ఎమ్మెల్యే తలసాని అభినందించారు. ఎంతో శిక్షణ ఇచ్చి మెడల్స్ సాధించే విధంగా కృషి చేసిన కోచ్‌లను కూడా అభినందించారు.

## ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తుంది



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన కన్‌జ్యూమర్ రైట్స్ ప్రొటక్షన్ ఫోరమ్ జాతీయ సెక్రటరీ డాక్టర్ పి.వి రవిశేఖర్‌రెడ్డి

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త : నిజమైన ప్రజా పాలన ప్రగతి పథం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తుందని కన్‌జ్యూమర్ రైట్స్ ప్రొటక్షన్ ఫోరమ్ జాతీయ సెక్రటరీ డాక్టర్ పి.వి రవిశేఖర్‌రెడ్డి అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500లకే గ్యాస్ పంపిణీ, రేషన్‌కార్డు ఉన్నవారికి 10లక్షల ఆరోగ్య భీమా 200యూనిట్లు ఉచిత విద్యుత్ పంపిణీ లాంటి పథకాలు సుమారు రెండున్నర నెలల్లో నాలుగు పథకాలను అమలు చేయడం సంతోషకరమైన విషయమని అన్నారు. రేవంత్‌రెడ్డి అహర్నిశలు ప్రజా పాలన కోసం కృషి చేసే నాయకుడు అనీ కాంగ్రెస్ పాలనను ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని పేర్కొన్నారు. ఈసందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి ఆయనను ఘనంగా సన్మానించారు.

## బిజెపి తెలంగాణ రాష్ట్ర ఎస్టీమోర్చా అధికార ప్రతినిధిగా గోవింద్ రాథోడ్

సంజీవరెడ్డి నగర్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: తెలంగాణ బిజెపి ఎస్టీ మోర్చా అధికార ప్రతినిధిగా అమీర్‌పేటలోని ఎస్ఆర్ నగర్‌కు చెందిన గోవింద్ రాథోడ్‌ను గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షులు కళ్యాణ్ నాయక్ నియమించడం జరిగింది. ఈ నియామకంపై గోవింద్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన గిరిజన మోర్చ అధ్యక్షులు కళ్యాణ్ నాయక్, గిరిజన మోర్చ రాష్ట్రశాఖకు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గతంలో గోవింద్ రాథోడ్ ఎస్ఆర్ నగర్ కేంద్రంగా 10 సంవత్సరాల పాటు ఏబివిపిలో పనిచేసి నగర , రాష్ట్రస్థాయి బాధ్యతలు చేపట్టి విద్యార్థులకు ఎన్నో సేవలు అందజేశారు. పార్టీ తనకు కేటాయించిన బాధ్యతలను స్వచ్ఛందంగా స్వీకరిస్తూ రాబోయే రోజులలో పార్టీకి విధేయంగా పనిచేస్తూ అనేక కార్యక్రమాలు చేసి బిజెపి పార్టీని తెలంగాణ రాష్ట్రంలో మరింత పెంపొందించి, తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆదరణ అభిమానాలను సాధించుకుంటామని అన్నారు.

## గార్వి షరీఫ్ ఫాతియాలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట ఫిబ్రవరి 25, ప్రభాతవార్త : రాంగోపాల్‌పేట డివిజన్ పరిధిలోని సిటీలైట్ చౌరస్తా వద్ద ఉన్న గౌసేపాక్ దర్గాలో ఆదివారం నిర్వహించిన గార్వి షరీఫ్ ఫాతియా కార్యక్రమంలో మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా తలసానిని నిర్వాహకులు ఫకీర్, జాకీర్,అమీత్, ఆలీలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తలసాని వెంట మాజీ కార్పొరేటర్లు మల్లిఖార్జున్ గౌడ్,అత్తెల్లి అరుణా శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ప్రేమ్‌కుమార్, వినయ్‌కుమార్, గౌరీశంకర్, సత్యనారాయణ, శివకుమార్ పాల్గొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా లష్కర్ సాధన కోసం పోరాటం



లష్కర్ సాధన సమితి లేటర్‌హెడ్‌ను విడుదల చేస్తున్న సభ్యులు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: లష్కర్ జిల్లా సాధన కోసం రాజకీయ పార్టీలకు అతీతంగా పోరాటం చేస్తామని లష్కర్ జిల్లా సాధన సమితి సభ్యులు తెలిపారు. రెండు వందల సంవత్సరాల చరిత్ర కలిగిన లష్కర్ అభివృద్ధిలో మాత్రం వెనుకబడి ఉందని అన్నారు. లష్కర్ జిల్లా సాధన లెటర్‌హెడ్‌ను ఆదివారం మధురానగర్‌లోని కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ లష్కర్ సాధన సమితి ఎలాంటి రాజకీయాలకు తావు ఇవ్వకుండా కేవలం లష్కర్ సాధనకోసమే పని చేస్తుందని చెప్పారు. కులాలు, మతాల జోలికి పోకుండా ప్రజల అభీష్టం మేరకు పోరాటం జరుపుతామన్నారు. రాజకీయ పాలకులను, ప్రముఖులను, విద్యావంతులను, సంఘాలా ప్రతినిధులను కలిసి లష్కర్ జిల్లా సాధనలో పాలుపంచుకోవాలని కోరతామన్నారు. ఈ కార్యాక్రమంలో సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్ గౌడ్, ప్రధానకార్యాదర్శి సాదం బాల్‌రాజ్ యాదవ్, ఉపాధ్యక్షుడు శైలేందర్, మిట్టపల్లి బాబురావు, రవీందర్ సాగర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మోండాలో విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలి : కొంతం దీపిక



మోండా డివిజన్‌లో విజయ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్న కార్పోరేటర్ కొంతం దీపిక

అడ్డగుట్ట, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: భారతీయ జనతా పార్టీ (బిజెపి) తలపెట్టిన విజయ సంకల్ప యాత్ర ఆదివారం రాత్రి పద్మారావు నగర్‌కు చేరుకుంటుంది. ఈ బస్ యాత్రను మోండా డివిజన్‌లోని సిటీ లైట్ హోటల్, గ్యాస్ మండి పంచ ముఖి హనుమాన్ దేవాలయం, మోండా మార్కెట్ మీదుగా వెళ్తున్న బస్ యాత్రను విజయవంతం చేసేందుకు మార్కెట్‌లో ఉన్న వీధి వ్యాపారులు, పూల వ్యాపారులు పాల్గొని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి స్వాగతం పలుకాలని మోండా వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు.

## కొమురవెల్లి మల్లన్న దేవాలయంలో పూజలు



అఫ్జల్‌గంజ్,ఫిబ్రవరి 25ప్రభాతవార్త: కొముర వెల్లి మల్లన్న దేవాలయంలో తెలంగాణ భజరంగ్ సేనా ఆద్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.తెలంగాణ భజరంగ్ సేనా అధ్యక్షులు ఎన్.ఆర్ లక్ష్మణ్‌రావుగుప్త,ప్రధాన కార్యదర్శి సూర్య శుక్లా, కార్యదర్శి సునీల్‌అగర్వాల్,ఎర్రం శ్రీనివాస్,నరేష్, విజయముదిరాజ్,రాజారాం,నదేష్,సిద్దు పాల్గొన్నారు.

## గణేష్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా పన్నాల రాజశేఖర్‌రెడ్డి



గణేష్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా గెలుపొందిన పన్నాల రాజశేఖర్‌రెడ్డిని అభినందిస్తున్న స్థానికులు

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త : ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే వచ్చే ఎన్నికల్లో భాగంగా గణేష్ నగర్ సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం జరిగాయి. బస్తీలో మొత్తం 90ఓట్లు ఉండగా పి.రాజశేఖరెడ్డికి 52ఓట్లు పోలయ్యాయి. మరో అభ్యర్థి రామ్‌గోపాల్ జిత్‌కు 23ఓట్లు, మరో అభ్యర్థి ప్రసాద్ గౌడ్‌కు 14 ఓట్లు పోలయ్యాయి.పి.రాజశేఖర్‌రెడ్డి బస్తీ సంక్షేమ సంఘం అద్యక్షునిగా గెలుపొందడంతో ఎన్నికల అధికారి పి.నర్సింగరావు నియామక పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తాను అధ్యక్షునిగా బస్తీ అభివృద్ధికి ఎంతో కృషి చేశానని స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజల సహకారంతో తాను చేసిన అభివృద్ధిని చూసి మరో సారి తనకు అధ్యక్షునిగా ఓటు వేసి గెలిపించినందుకు స్థానిక బస్తీ వాసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీరాముడి ఆశీర్వాదంతో మూడోమారు ప్రధాని మోడీ విజయం ఖాయం: కూన శ్రీశైలంగౌడ్




కుత్బుల్లాపూర్‌లో నిర్వహించిన బిజెపి విజయసంకల్ప యాత్రను ఉద్దేశించి ప్రసంగిస్తున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: కేంద్రంలో మూడోమారు నరేంద్రమోడీ నాయకత్వంలో భారతీయ జనతాపార్టీ తిరిగి అధికారంలోకి రావడంఖాయమని కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. భారతీయ జనతాపార్టీ పిలుపుమేరకు కుత్బుల్లాపూర్, ఐడిపిఎల్ చౌరస్తాల మీదుగా భారీర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా బిజెపి ఎంఎల్ఎ పైడి రాకేశ్‌రెడ్డి, బిజెపి జాతీయ నాయకులు మురళీధర్‌రావు, మాజీ ఎం.పి. చాడా సురేశ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు పన్నాల హరీశ్‌రెడ్డిలకు ఆయన ఘనస్వాగతంపలికారు. ఈసదర్భంగా కూన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి జెండా ఎగరడం ఖాయమన్నారు. ప్రధానంగా బిజెపి కాంగ్రెస్‌ల మధ్యే పోటీవుంటుందని మోడీవైపే ప్రజలు మొగ్గుచూపుతున్నారన్నారు. అయోధ్య శ్రీరాముడి ఆశీస్సులతో దేశవ్యాప్తంగా సుమారు 400సీట్లు గెలుపొందటం ఖాయమన్నారు. గత పది సంవత్సరాలుగా ప్రధాని నరేంద్రమోడీ అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చి దేశాన్ని ప్రగతిబాటలో నడిపారని తెలిపారు. కొంపల్లి నుండి ప్రారంభమైన విజయ్ సంకల్ప యాత్ర సుచిత్రా, జీడిమెట్ల, ఐడిపిఎల్‌ల మీదుగా జగద్గిరిగుట్టలో స్ట్రీట్‌కార్నర్ సమావేశంతో పూర్తిచేశారు.

## ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాలకు ఎంపికైన ఓక్రిడ్జ్ విద్యార్థులు

దుండిగల్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేటలోని ఓక్రిడ్జ్ విద్యార్థులు ప్రతిష్టాత్మకమైన విశ్వవిద్యాలయాలకు ఎంపికైయ్యారు. విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబర్చి అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్, అమ్హెర్స్ట్, యూనివర్సిటీ ఆఫ్ మిన్నెసోటా-ట్విన్‌సిటీస్, వర్జీనియా కామన్వెల్త్ యూనివర్సిటీ, డ్రెక్సెల్ యూనివర్సిటీ, టెంపుల్ యూనివర్సిటీ, ఓపి జిందాల్ యూనివర్సిటీలలో ఆఫర్లు అందుకున్నారు. ఈసందర్భంగా సిబిఎస్ఇ కరికులమ్ హెడ్ షాలిని మాట్లాడుతూ మా విద్యార్థులు అందుకున్న ఈవిజయం అసాధారణ అకడమిక్, అభ్యాసన పట్ల ఉన్న అంకిత భావానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నామన్నారు. విద్యార్థుల మేధస్సు, విమర్శ నాత్మక ఆలోచనలకు నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఆఫర్లు అందుకున్న విద్యార్థులను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో ప్రణాళిక హెడ్ అనురాధ, ప్రిన్సిపాల్ బల్జీత్‌ఓబేరాయ్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్‌అజమతుల్లాహ హుస్సేనీ కలిసి బోకె.అందచేస్తున్న దృశ్యం

## వక్ఫ్‌బోర్డు చైర్మన్‌ను కలిసిన నాయకులు

బేగంబజార్,ఫిబ్రవరి 25ప్రభాతవార్త: హైదరాబాద్ జిల్లా టిఎన్‌జిఓ అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ మజీదుల్లాహ్ హుస్సేనీ ఆద్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజమతుల్లాహ్ హుస్సేనీని మర్యాద పూర్వకంగా కలిశారు.ఈమేరకు చైర్మన్ సయ్యద్ అజమతుల్లాహ్ హుస్సేనీ బొకె అందచేసి శాలువ కప్పి సన్మానించారు. డిపార్ట్‌మెంట్ లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకుగాను కృషి చేస్తానని హామి ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి ఖలీద్‌అహ్మద్, వైదిక్‌శాస్త్రి, బి.శంకర్, సయ్యద్ ఇబ్రహీం,అసద్ హుస్సేనీ, తిర్మిజీఅబ్బాస్,అబ్దుల్ ఖాదర్,హయుంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన అన్నమయ్య సంగీత మాధుర్యం



సంకీర్తనలు అలపిస్తున్న కళాకారులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:పవిత్ర మాఘమాసాన్ని పురస్కరించుకుని శ్రీమహావిష్ణువు స్మరణలో స్థానిక నల్లకుంట శ్రీ శృంగేరి శంకర మఠం ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం అన్నమయ్య పరివారం నిర్వహణలో శ్రీశృంగేరి శంకర్ మఠం సౌజన్యంతో 'అన్నయమ్య సంకీర్తన మాధుర్యం' భక్తి సంగీత కార్యక్రమం ఆసాంతము కన్నుల పండువగా సాగింది. అన్నమయ్య సంకీర్తన చూడామణి ఎన్.సి. శ్రీదేవి (తిరుపతి) తన మధుర గానంతో అలపించిన శ్రీమన్నారణ, దేవా నమో దేవా, నీ నామమే మాకు, ఇట్టివాని నన్ను, కొమ్మా నీ చక్కదనము, మూసిన ముత్యానకేలే, ఏమని పొగడుదుమే, రాముడితడు, వెన్నముద్ద కృష్ణుడు, అదివో అల్లదివో తదితర సంకీర్తనలతోపాటు స్నేహాంకిత అలపించిన అంతయు నీవే హరిపుండరీకాంక్ష, ఇద్దరికి అభయమ్ము లిచ్చుచేయి, తెలిసితే మోక్షముఉ కీర్తనలు స్వామి భక్తులను మంత్ర ముగ్దులను చేశాయి. చివరిగా శ్రీదేవి గానం చేసిన చూడరమ్మ సతులాలా సంకీర్తనతో స్వామివారి ఉభయ దేవేరులకు మంగళ నీరాజనాలు అర్పించడంతో కార్యక్రమం ముగిసింది. తిరుపతి అన్నమయ్య ప్రాజెక్టు కళాకారులు ఎన్.బాలాజీ, పి.పాండురంగారావు, పి.సురేష్ వాయిద్య సహకారం అందించారు. తిరుపతి అన్నమయ్య పరివారం వ్యవస్థాపకులు యనమండ్ర వెంకట కృష్ణయ్య, సభ్యులు కందుకూరి సుబ్రహ్మణ్యం, వై.పురందర్, కాందూరి శ్రీలక్ష్మి, కె.ఎన్.సంగీత, శంకర మఠం శాఖాధిపతి కె.కృష్ణారావు, ప్రముఖ వాగ్గేయకారులు నల్లాన్ చక్రవర్తి మూర్తి, సీనియర్ పాత్రికేయులు జి.వల్లీశ్వర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళకారులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

## ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



మంత్రి రాజనర్సింహాకు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఆరోగ్యశ్రీ విభాగం ప్రతినిధులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త: త్వరలో ఆరోగ్యశ్రీలో పనిచేస్తున్న ఉద్యోగులకు న్యాయం చేస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చారని తెలంగాణ ఆరోగ్యశ్రీ విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గిరి యాదయ్య, ఎం.కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ మిత్రులకు డాటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ కల్పించాలని, కనీస వేతనం 35 వేలతోపాటు టిఎ, డిఎ కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి షఫ్లిలింగ్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఆదే విధంగా 16 సంవత్సరాల నుంచి పిహెచ్‌సిలో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య మిత్రులను తిరిగి పిహెచ్‌సిలో నియమించాలని, ఆరోగ్యశ్రీలో ఖాళీగా ఉన్న పోస్టులను సీనియారిటి ప్రకారం పదోన్నతులు కల్పించాలని కోరామని వారు తెలిపారు.

## డ్రెస్ చింపేసి.. ఫోన్ పగలగొట్టి

### హోంగార్డుకు పచ్చి బూతులు

### జూబ్లీహిల్స్‌లో మహిళ వీరంగం

హైదరాబాద్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త : జూబ్లీహిల్స్‌లో యువతి హంగామా సృష్టించింది. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రి ఓ మహిళ రచ్చ రచ్చ చేసింది. ట్రాఫిక్ హోంగార్డుకు చుక్కలు చూపించింది.రాంగ్ రూట్లో రావడమే కాకుండా అడ్డుకున్న హోంగార్డుపై బూతులు తిడుతూ రెచ్చిపోయింది.హోంగార్డు డ్రెస్‌ను చింపడమే కాకుండా ఫోన్ పగలగొట్టింది. ఆ మహిళ రెడ్ డ్రెస్‌లో జాగ్వర్ కారులో వచ్చిందని..అయితే ఆమె నడిపిన కారు గుండాల శ్రీలత అనే పేరుపై రిజిస్టర్ అయి ఉందని పోలీసులు తెలిపారు. యువతిపై హోంగార్డు విగ్నేష్ బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. యువతిపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

## కోకాపేట్‌లోని జయభేరి వద్ద దళితుల ధర్నా

### న్యాయం చేయాలని దళితుల డిమాండ్



మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వన్‌మోర్‌గేమ్ సెంటర్‌ను చైర్మన్ నరేందర్, ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి, నాయకులు మల్లేష్ ముది రాజ్, నర్సిహ్మలతో కలిసి ప్రారంభిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త : గండిపేట మండలం కోకాపేట్‌లోని జయభేరి కన్స్‌ట్రక్షన్ వద్ద మా భూములను మురళీమోహన్ కబ్జా చేశారంటూ దళితులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. దశాబ్దాలుగా మా తాతలు, మా తండ్రులు, ఇప్పుడు మేము చదును చేసుకుంటున్న భూమికి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి మా భూములను సినిమా నటుడు మురళీమోహన్ కబ్జా చేస్తున్నారని, ఇతడికి అధికారులు, నాయకులు సహకరిస్తున్నారని దళితులు ఆరోపించారు. 1951.నుంచి మేమే ఈ గుట్టలు, గుంతలను చదును చేసుకొని, వ్యవసాయం చేసుకొని జీవనం సాగించామని, ఇందుకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు మా వద్ద ఉన్నాయని ఆందోళన కారులు పేర్కొన్నారు. చదువు లేదని, డబ్బులు లేవని, మేము కోర్టుల చుట్టూ తిరుగలేమని మాపై బడా రియల్ ఎస్టేట్ సంస్థ అధిపతి మురళీ మోహన్ జులుం చేస్తున్నారని, మా ప్రాణాలైనా వదులుకుంటాం కానీ, మా భూములను మాత్రం వదులుకునేది లేదని ఆందోళనకారులు స్పష్టం చేశారు. ఎకరం 200. ఉన్నప్పటి నుంచి మేమే ఈ భూములలో పంటలు పండించుకొని జీవించామని, ఇప్పుడు ఎకరం ధర రూ.100.కోట్లకు పెరుగడంతో ఎక్కడో ఆంధ్రాలో పుట్టిన వ్యక్తి ఈ భూమి నాదంటూ తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి మమ్ములను రోడ్డుపాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని, మా భూములను మాకే ఇప్పించాలని, లేదంటే మేమంతా సామూహికంగా ఇక్కడే ఆత్మహత్యలు చేసుకుంటామని దళితులు స్పష్టం చేశారు. మురళీమోహన్‌కు వ్యతిరేకంగా ఆందోళనకారులు నినాదాలు చేశారు.

### కోట్ల రూపాయల విలువ చేసే మా భూములను అప్పనంగా లాకునకంటున్నారని ఆందోళన

1951.నుంచి మేమే వ్యవసాయం చేసుకొని జీవనం సాగించాం. గుట్టలు తొలగించాము, చదును చేశాము. అన్ని పత్రాలు మాపేర్లపై ఉన్నాయి. దొంగ డాక్యుమెంట్లు సృష్టించుకొని మా దళితుల భూములను సినీమా యాక్టర్, జయభేరి అధిపతి మురళీమోహన్ కబ్జా చేస్తున్నాడని మాకు న్యాయం చేయాలని కోరారు.

## విద్యార్థులకు గ్లోబల్ స్థాయి అవార్డుల ప్రదానం




ఛాంపియన్‌షిప్, నగదు బహుమతులు పొందిన విద్యార్థులతో మధుసూదన్

రవీంద్రభారతి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త : పిల్లలకు చిన్ననాటి నుండే ఉన్నతస్థాయి విద్యావిధానాల ద్వారా తీర్చిదిద్ది దేశం గర్వించదగ్గ అత్యున్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అటు తల్లిదండ్రులు, ఇటు అన్ని విద్యాసంస్థలపై ఉందని తెలంగాణ రాష్ట్ర గుర్తింపు పొందిన విద్యాసంస్థల సంఘం రాష్ట్రాధ్యక్షుడు ఎస్.మధుసూదన్ అన్నారు. ఐఎస్ఓ సర్టిఫైడ్ ఆర్గనైజేషన్ స్మార్ట్ జీనియస్ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో సంస్థ ఛైర్మన్ రాజ్యలక్ష్మి రాజ్‌మోహన్ నేతృత్వంలో జరిగిన గ్లోబల్‌స్థాయి పోటీల్లో విజేతలకు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన జెఎన్‌టియు మాజీ రిజిస్ట్రార్ డా. ఎం.మంజూర్‌హుస్సేన్, రాజ్‌మోహన్ తదితరులతో కలిసి గ్లోబల్‌స్థాయిలో విద్యార్థులకు అబాకస్, వేదిక్ మాథ్స్, లైఫ్‌స్కిల్, హ్యాండ్‌రైటింగ్ వంటి అనేక విధానాలలో శిక్షణా తరగతులు నిర్వహించి 4 నుండి 14 సంవత్సరాల వయస్సు గల పిల్లలను స్మార్ట్‌జీనియస్‌గా మలిచి, ఆయా విభాగాలలో అంతర్జాతీయస్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలకు అవార్డులు, రివార్డులు, నగదు బహుమతులతో ప్రోత్సహించడంతో పాటు భారత పూర్వ రాష్ట్రపతి ఏపిజె అబ్దుల్‌కలాం పేరిట ఛాంపియన్స్‌కు అవార్డుతోపాటు నగదు బహుమతులు అందజేసి, వారిని ప్రోత్సహించడం ప్రశంసనీయమని సంస్థ ఛైర్మన్ రాజ్యలక్ష్మి రాజ్‌మోహన్, రాజ్‌మోహన్‌లను, ఉపాధ్యాయులను అభినందిస్తూ విజేతలకు శుభాభినందనలు, పోటీల్లో పాల్గొన్న వారందరికి అభినందనలు తెలిపారు.


మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేత

## మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం

**కేశంపేట్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త** కేశంపేట్ మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామంలో అనారోగ్యంతో గన్నోజి అచ్చమ్మ మృతి చెందారు. గ్రామానికి చెందిన మృతురాలి కుటుంబ సభ్యులకు నిపేద కుటుంబానికి చెందివారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు గమనించి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఐదు వేల రూపాయలను మరియు 50 కేజీల బియ్యాన్ని వారి కుటుంబ సభులైన గన్నోజి ఆంజనేయులుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బీస కరుణాకర్‌రెడ్డి మాజీ సర్పంచ్ పోగుల భీమయ్య లాలమోని చంద్రయ్య ముదిరాజ్ గుత్తి చంద్రయ్య నరసింహారెడ్డి కొమిరి లింగం నిరంజన్ శేఖర్ వెంకటయ్య యాదయ్య తదితులు పాల్గొన్నారు.

## ఆహా ఏమి రుచి తినరా మైమరచి..!
### అక్కమ్మ చెరువు చేపలకు భలే గిరాకీ



**నందిగామ, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త** నందిగామ మండలం నర్సప్పగూడలో ఉన్న అక్కమ్మ చెరువులోని చేపలకు భలే గిరాకీ ఏర్పడింది. నరసప్పగూడ మత్స్య కార్మిక సంఘం ఆధీనంలో ఉన్న ఈ చెరువులో కంశలు రవ్వలు బొచ్చెలు కొర్రమీను బంగారు తీగలు తదితరవి ఉన్నాయి. ఒక్కో చేప ఐదారు కిలోలదాకా ఉన్నాయి. కిలోరూ.150 దాక విక్రయిస్తున్నారు. కంచెలు కొర్రమీను అయితే కిలో 200,250 అమ్ముతున్నారు. పారిశ్రామిక ప్రాంతమై మినీ ఇండియాగా మారిన ఈ ప్రాంలో ఆదివారం వచ్చిందంటే చేపల కోసం చెరువు బాట పడతారు. మచి రుచి కలిగి ఉండడంతో చుట్టుప్కల గ్రామాల భోజన ప్రియులు చేపలకోసం ఎగబడుతున్నారని చేపల విక్రయదారులు నందీశ్వర్ తెలిపారు. ఈ చేపల ద్వారా ఎంతో మందికి ఉపాధి పొంది జీవనం సాగిస్తున్నామన్నారు.

## క్రీడా ప్రాంగణం బిల్లులు నేటికిరాలే

**బషీరాబాద్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త**

ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురి కావడంతో మైల్వార్ గ్రమ పరసర ప్రాంతంలో క్రీడ ప్రాంగణానికి స్థలం లేకపోవడంతో పెద్ద సమస్యగా మారింది. వికారాబాద్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ భూమి 235 సర్వే నెంబర్‌లో బృహత్ పల్లె ప్రగతి వనం పార్కు భూమిలో ఉన్న ఖాళీ స్థలంలో నిర్మించడం జరిగిందని మాజీ సర్పంచ్ సిమా సుల్లానా పేర్కొన్నారు. క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు ముందు ఈ స్థలం చెట్లు గుట్టలతో నిండి వుండేదని ట్రాక్టక్ జేసిబి సహాయంతో ఈ స్థలం చదును చేసి మొరంవేసి క్రీడా ప్రాంగణం నిర్మించడం జరిగిం దని పేర్కొన్నారు. క్రీడా ప్రాంగణంకు లక్ష10వేల రూపాయలు ఖర్చు కాగా అధికారులు 60వేలు మాత్రమే రికార్డ్ చేశారని పేర్కొన్నారు. క్రీడా ప్రాంగణం ఏర్పాటులో తను 50 వేల నష్టపోతున్నామని తెలి పారు. చేసిన అభివృద్ధి పనుల బిల్లులు సకాలంలో వచ్చేలా అధికా రులు చర్యలు చేపట్టాలని మాజీ సర్పంచ్ మాజీ వైస్ ఎంపిపి సోదరుడు ఖలీల్ కోరారు.

## అయోధ్యకు తరలిన రామ భక్తులు


అయోధ్యకు తరలివెళ్తున్న రామభక్తులు

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** అయోధ్య రామమందిరానికి ఏర్పాటు చేసిన స్పెషల్ అస్తా రైలులో తాండూరు నియోజకవర్గం నుండి 300మంది రామ భక్తులు అయోధ్య రాముడిని దర్శించుకోవడానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి వెంకట్, జిల్లా ఉపాధ్యక్షురాలు లలిత, మరో జిలాన్ల ఉపాధ్యక్షుడు బాలి శివకుమార్, బిజెపి పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, సీనియర్ నాయకులు పాల్గొని జెండా ఊపి రైలును ప్రారంభించారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం : ఎస్సై


గెలుపొందిన జట్లుకు బహుమతులు అందజేస్తున్న ఎస్సై వేణుగోపాల్‌గౌడ్

**ధారూర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** క్రీడలు మానసిక ఉల్లాసానికి వారీరక ఆరోగ్యానికి దోహదపడుతుతాయని ధారూర్ ఎస్సై వేణుగోపాల్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని గత పదిహేను రోజుల క్రితం ప్రారంభించిన గడ్డం శైలజ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం చివరి మ్యాచ్ నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర భ్ంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో నూ రాణించాలని, అందుకు తల్లిదండ్రులు కూడా సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ముఖ్య అతిధిగా పాల్గొని గెలుపొందిన రెండు జట్లను అభినందించి మొదటి బహుమతి కప్పు, 25 వేల నగదు ద్వితీయ బహుమతి కప్పు 15వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాబా ఖాన్ ముజాఫర్ అవినాష్‌రెడ్డి ఎంఐఎం అధ్యక్షుడు మోయిజ్ ఖురేషి అబ్బాస్ బాబా ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధాప్యంలో ఒంటరితనం కథ సంధ్యా చాయా

మరాఠీ నాటక రచయిత జయవంత్ దాల్వీ రంచించిన సంధ్యా ఛాయా వృద్ధాప్యం దానితోపాటు తెచ్చే భావోద్వేగ నిర్జనానికి మరియు ఒంటరితనానికి సంబంధించిన ప్రాథమిక కథనం. జీ థియేటర్ టెలిప్లేఒ నటించిన ఫిల్మ్ టెలివిజన్ థియేటర్ నటుడు దీపక్ ఖాజీర్ కేజ్రీవాల్ దాని తెలుగు మరియు కన్నడ వెర్షన్లు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మరియు కర్నాటకలోని ప్రేక్షకులను కదిలిస్తాయని చెబుతున్నారు.


లిటిల్‌స్కాలర్స్ యాజమాన్యంతో ఒకరోజు ఉపాధ్యాయ బృందం

## లిటిల్‌స్కాలర్స్‌లో ఘనంగా స్వపరి పాలన

**ఆమనగల్లు, ఫిబ్రవరి25, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణం శివాలయం కాలనీలోని లిటిల్‌స్కాలర్స్ హైస్కూల్‌లో శనివారం విద్యార్థులు స్వపరి పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. సంప్రదాయ రీతిలో అందమైన వస్త్రధారణతో చూడముచ్చటగా ముస్తాబై పాఠశాలకు హాజరైనారు. చిన్నారుల వేషధారణ చూపరులను విశేషంగా ఆకట్టుకున్నది. స్వయంపాలనతో పాఠశాల్లో సందడి చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు ఇతరులు విచ్చేసి స్వయం పాలనను తిలకించి ప్రతిభాపాటవాలను కొనియాడారు. పాఠశాల కరస్పాండెంట్ జిల్లెల సుజాతా సుదర్శన్‌రెడ్డి పర్యవేక్షణలో విద్యార్థులు స్వపరి పాలన జరుపుకున్నారు. 80మంది విద్యార్థులు స్వయం పాలనలో పాల్గొన్నారు. విష్ణువర్ధన్, పావని, చందులాల్, రాహుల్, ప్రశాంత్, నవీన్, ప్రణీత, కావ్య, సరిత, తిరుపతి, నితీష్, శివ, శ్రీకాంత్, వసంత, హాసినీగౌడ్, మేఘనలు స్వయం పాలనలో ప్రత్యేక హోదా ప్రతినిధులుగా అలరించారు. అనంతరం ముగింపు సమావేశాన్ని స్థానిక భవాని గార్డెన్స్‌లో ఏర్పాటు చేశారు. ప్రతిభ కనబర్చిన ఒకరోజు ఉపాధ్యాయ బృందానికి బహుమతులు అందజేశారు. ముగింపు వేడుకలకు లిటిల్‌స్కాలర్స్ విద్యా సంస్థల చైర్మన్ చుక్క అల్లాజీగౌడ్, అకాడమిక్ అడ్వయిజర్ జిల్లెల సుదర్శన్‌రెడ్డి, చ్కు సావిత్రి అల్లాజీగౌడ్‌లు హాజరై బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చెక్కాల లక్ష్మణ్, ప్రిన్సిపాల్ శ్రీశైలం, ఉపాధ్యాయబృందం వెంకటేశ్వరశర్మ, రమాదేవి, రేవతి, శ్రీరాం, యాదయ్య, చలం, స్వప్న, నవ్య, సరిత, సోని తదితరులు ఉన్నారు.

## ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలువర్చుకోవాలి


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**ఆమనగల్లు, ఫిబ్రవరి25, ప్రభాతవార్త:** సమాజ శ్రేయస్సు కోసం ప్రతిఒక్కరూ ప్రజాసేవా కార్యక్రమాలను అలవర్చుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సమాజ సేవలు ఆపదలో ఉన్న నిరుపేదలకు అండగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన పాత్రికేయుడు ఏలె మనోజ్ జయంతిని పురస్కరించుకుని తల్లిదండ్రులు ఏలె నిరంజన్ వేదశ్రీ దంపతులు సమకూర్చిన మధ్యాహ్న భోజనాన్ని లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో నిర్వహించారు. సీఐ విజయ్‌కుమార్, ఎస్సై బాల్‌రాంనాయక్, క్లబ్ అధ్యక్షుడు యాచారం వెంకటేశ్వర్లు, టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్‌లతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సేవలను పలువురులు కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు జిల్లా చైర్మన్ జూలూరి రమేశ్, ఎం చంద్రశేఖర్, కర్నాటీ కొండల్‌రెడ్డి, ఎంగలి బాలకృష్ణ, పాండురెడ్డి, వీరబొమ్మ రాంమోహన్‌గుప్త, పీఆర్‌ట ఎంప పాష, తిరుపతిరెడ్డి, బీచ్యనాయక్, యాట నర్సింహ్మా, వస్పుల మానయ్య, ఐఎన్‌టీయుసీ జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్, మెకానిక్‌బాబా తదితరులు ఉన్నారు.

## దివంగత ఎస్సై హన్మంతురెడ్డి వర్ధంతి


విగ్రహం ఎదుట నివాళులు అర్పిస్తున్న సీఐ విజయ్‌కుమార్, కుటుంబ సభ్యులు

**ఆమనగల్లు, ఫిబ్రవరి25, ప్రభాతవార్త:** సమాజ శాంతి స్థాపనలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమైనదని ఆమనగల్లు సీఐ విజయ్‌కుమార్ అన్నారు. ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసులు ఎందరో ఉన్నారని, వారి ఆశయాలు, సిద్దాంతాలు అన్ని తరాలకు ఆదర్శనీయమని ఆయన కొనియాడారు. నక్సలైట్ కాల్పుల్లో ప్రాణాలు పోగొట్టుకున్న దివంగత ఆమనగల్లు ఎస్సై హన్మంతురెడ్డి వర్ధంతి వేడుకలు ఆదివారం జరిగాయి. ి కుటుంబ సభ్యులు కాసం రాంరెడ్డి, తమ్ముడు ముత్యాలు, బావ సాయిబాబా, పెద్ద చెల్లెలు ముత్యాల జ్యోతి, చిన్న చెల్లెలు లక్ష్మి, దయాకిరణ్‌ల సమక్షంలో సీఐ విజయ్‌కుమార్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో హన్మంతురెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. హన్మంతురెడ్డి సేవలను కొనియాడారు.

## యువత చదువుతోపాటు ఆటల్లో రాణించాలి


వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న, మాజీ సర్పంచ్ పెంటయ్య

**పూడూరు. ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** యువత చదువుతోపాటు ఆటల్లో రాణించాలని జిల్లాపార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ పెంటయ్య పేర్కొన్నారు. ఆదివారం పూడూరు మండలం పరిధిలోని అంగడి చిట్టంపల్లిలో రాకంచెర్ల పెంటన్న అద్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొని టాస్‌వేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలనుండే యువత మట్టిలో మాణిక్యాల్లా ఆటల్లో రాణించి దేశానికి ప్రాతినిద్యం వహించిన క్రీడాకారులు ఎందరో ఉన్నారని గుర్తుచేశారు. డైరెక్టర్ చెన్నయ్యగౌడ్, నాయకులు రవి, శేఖర్, శ్రీను, రాజు, ప్రవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నా కుమారుడిని కాపాడండి.. తల్లి దండ్రుల ఆవేదన

**బంట్వారం, ఫిబ్రవరి 25 (ప్రభాతవార్త) :** నా కుమారుడిని కాపా డండి... అని తల్లి దండ్రుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం సల్బత్తాపూర్ గ్రామానికి చెందిన, పోలీస్ నారాయణ రెడ్డి కుమారుడు, పోలీస్ రాజేందర్ రెడ్డి, కిడ్నీ మరియు న్యూమోనియా సమస్యతో, హైదరాబాద్ లోని బొల్లారం రోడ్డులో గల మమత హాస్పిటల్ లో చికిత్స పొం దుతున్నాడు. ఆయన పరిస్థి తి విషమంగా మారింది. ఇప్పటికే ఒక్క లక్ష రూపాయలు ఖర్చు అయినాయి... వీరి పరిస్థితి రెక్కాడితే గానీ... డొక్కాడని బ్రతుకులు. ఇప్పటికే సంవత్సరం క్రితం, రాజేంద ర్‌రెడ్డి కి రెండు కిడ్నీలు ఫెయిల్ అవ్వడంతో వాళ్ళ తండ్రి ఒక కిడ్నీ ఇవ్వడం జరిగింది. మళ్ళీ ఇప్పుడు మొదటి సారిలాగే సమస్య వుంది. ప్రస్తుతం దాతల సహా యం కోసం ఎదురు చూస్తున్నారు. దయచేసి ఎవరైనా సహాయం చెయ్యాల ఒకునే వాళ్ళు, రాజేందర్ రెడ్డి ఫోన్ పే, గూగుల్ పే, 91604 72271, 8186861514నెంబర్‌కు తోచినంత సహాయం చేసి, నా కుమారుని ప్రాణాలు కాపాడండి అని, తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.


అపూర్వసమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

## ఘనంగా పూర్వవిద్యార్థుల అపూర్వసమ్మేళనం

**కందుకూరు, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** విద్యార్థులు ఉన్నత స్తితికి ఎదిగితే అనందపడే వారిలో ఉపాధ్యాయులు ముందువరుసలో ఉంటారని కందుకూరు ఉన్నత పాఠశాల పూర్వ ప్రధానోపాద్యాయులు గోపాలక్రిష్ణ పేర్కొన్నారు. కందుకూరు ఉన్నత పాఠశాల 1994-95 బ్యాచ్ పూర్వవిద్యార్థుల అత్మీయ సమ్మేళనం అదివారం మం డల కేంద్రంలో జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పూర్వఉపాద్యాయులు వెంకటేషం, జగన్మోహనాచారి, పెంటారెడ్డి, దుర్గాలత, పిఇటి సుదర్శన్‌లు పాల్గోన్నారు. ఈ సందర్బంగా అనాడు విద్యాబోదన చేసిన ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సత్కరించి పాదాబివంతనం చేశారు. ఈ సందర్బంగా విద్యార్థులను ఉద్దేశించి అనాటి ఉపాధ్యాయులు అనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతు 30 సంవత్సరాల క్రితం నాటి ఈ పూర్వవిద్యార్థులు అత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకుని అందరు కలుసుకోవడమే కాకుండా ఉపాధ్యాయులపట్ల విద్యార్థులు చూపించిన ప్రేమాభిమానాలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో 1994-95 బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈ నెల 26 నుండి గంగా భ్రమకాంబికా సమేత మల్లిఖార్జున స్వామి ప్రతిష్టా ఉత్సవాలు


విలేఖరులతో మాట్లాడుతున్న ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ

**కీసర, ఫిబ్రవరి25, ప్రభాతవార్త:** ఈ నెల 26వ తేదీ నుండి (నేటి నుండి) చీర్యాల లక్ష్మీనృసింహ్మాస్వామి దేవస్థానంలో నూతనంగా నిర్మించిన శ్రీ గంగా భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి గణపతి, నవగ్రహ, శిఖర పాంచహ్నిక విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు ఏప్రిల్ 1వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ తెలి పారు. ఆగమ ప్రతిష్టాపనాచార్యులు చండీ ఉపాసకులు భోగి సాయిశర్మ ఆచార్య త్వమున ఐదు రోజుల పాటు మహవైభవంగా వైదిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. మార్చి శుక్రవారం ఉదయం 9.15 గంటలకు స్వాతి నక్షత్ర యుక్త మేషలగ్న పుష్కరాంశ సుమహుర్తమున విగ్రహ ప్రతిష్ట జరుగుతుందని తెలిపారు. ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు అన్ని సౌకర్యాలు పూర్తి చేశామని, భక్తులకు ఉచితంగా ప్రతి రోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో అన్నదానం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 26వ తేదీ సోమవారం మంగళవాయిద్యం, గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచనం పంచగవ్యం, యంత్రమార్జనలు, యాగశాల ప్రవేశం, త్రిశూల పూజ, తీర్ధ ప్రసాదాలు, 27వ వేదీ ఉదయం 8.30 గంటలకు గవ్యాంత పూజలు, వాస్తుపూజ, పర్యగ్ని కరణం, జలాధివాసం, ప్రధాన దేవతా హోమాలు, నీరాజన తీర్ధ ప్రసాదాలు సాయంత్రం 5.30 గంటలకు మండపార్చన, అవాహిత దేవతా హోమాలు, వాస్తు హోమం రుద్రార్చన, నీరాజన మంత్రపుష్పాలు, తీర్ధ ప్రసాదాలు, 28వ తేదీన ఉదయం 8.30 నిమిషాలకు గవ్యాంత పూజలు, చండీ పారాయణం, చండీ హోమం, విశేష రుద్ర హోమం, అవాహిత దేవతా మూల మంత్ర హోమాలు, ధాన్యదివాసం, సాయంత్రం 5.30 గంటలకు ఉదక శాంతి, దిశహోమాలు, శాంతి హోమాలు, జపతర్పణాలు, తీర్ధ ప్రసాదాలు, 29వ తేదీన గవ్యాంత పూజలు, ఏకాదశ రుద్రాభిషేకం, గ్రామ ప్రదక్షణ, వాస్తుబలి, నవగ్రహ హోమాలు, మూలమంత్ర హోమాలు, తీర్ధ ప్రసాదాలు, సాయంత్రం 5.30 నిమిషాలకు శాలార్చన, మండపదేవత అర్చన, జపహోమాలు, శాలాంగ దేవత హోమాలు, పంచశయాదివాసం, చతుర్వేత పారాయణం, మంత్రపుష్పం, తీర్ధ ప్రసాదాలు, మార్చి 1వ తేదీన ఉదయం 7 గంటలకు గవ్యాంత పూజలు, గర్తన్యాసం, యంత్ర విగ్రహ ప్రతిష్టాపన, మహ పుర్ణాహుతి, కుంభాభిషేకం, త్రిశూల స్నానం, పార్వతీ పరమేశ్వర శాంతి కళ్యాణం, ఆశీర్వచనం, పండిత సన్మానంతో ప్రతిష్ట ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ఆలయ ధర్మకర్త మల్లారపు శ్రీ హరిగౌడ్‌లు తెలిపారు.

## ముగిసిన మూడు రోజుల శిక్షణ శిబిరం


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రొ.ఉపేందర్‌రెడ్డి, లీలా లక్ష్మారెడ్డి

**కడ్తాల్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ, డిపార్టుమెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ తెలంగాణ మూడు రోజుల పాటు కడ్తాల్ మండలం అనుమసుపల్లి గ్రామ సమీపంలో ది ఎర్త్ సెంటర్‌లో నిర్వహించిన లీడ్ ఎర్త్ లీడర్స్ అనే కార్యక్రమం నేటితో ముగిసింది. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ ఎన్. ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు నిరంతరం ఉత్సాహంతో సమాజానికి, పర్యావరణానికి మేలుచేసే కార్యక్రమాలను ఆచరస్తూ ఈ దిశగా పర్యావరణ నాయకత్వం వహించాలని సందేశమిచ్చారు. కార్యక్రమంలో మూడు జిల్లాలు (మహబూబ్‌నగర్, నారాయణపేట, రంగారెడ్డి) డిఎస్‌ఓలు శ్రీనివాసులు, భానుప్రకాష్, శ్రీనివాస్‌రావు, ఎస్‌సిఈఆర్‌టి నిపుణులు వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రమేష్‌రావు పాల్గొన్నారు. అనంతరం సిజిఆర్ సంస్థ అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్తలు డా. నక్కసాయి భాస్క ర్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు మల్లేశం, బాలరాజు, నరసింహులు, మాధవి, యమున, జయప్రద, సిజిఆర్ ప్రతినిధులు, వెంకటేష్, రజనికాంత్, బీరేష్, లక్ష్మిప్రసన్న, సుష్మా, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## కడ్తాల్‌లో మాజీ మంత్రి కెటిఆర్‌కు ఘన స్వాగతం


మాజీ మంత్రి కెటిఆర్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

**కడ్తాల్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** ఆమన్‌గల్ మండల కేంద్రంలో సంత్ సేవాలాల్ 285వ జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు వెళ్తున్న సందర్బంగా ఆదివారం కడ్తాల్ మండల కేంద్రంలో మాజీమంత్రి కెటిఆర్‌ని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ భగీరథ మాజీ ఛైర్మన్ ఉప్పల వెంకటేష్, కడ్తాల్ జడ్పీటిసి దశరథ్‌నాయక్, సింగిల్ విండో ఛైర్మన్ గంప వెంకటేష్‌గుప్తా, కల్వకుర్తి మున్సిపాలిటీ ఛైర్మన్ ఎడ్మ సత్యం, వైస్ ఎంపిపి ఆనంద్, మండల బిఆర్‌ఎస్ నాయకులు తదితరులు ఘనస్వాగతం పలికి బొకే అందజేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న సత్తు పాండురంగారెడ్డి

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి
### సత్తు పాండురంగారెడ్డి

**యాచారం ఫిబ్రవరి25, ప్రభాతవార్త :** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ సంఘ నాయకులతో వెంటనే చర్యలు జరపాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టియుటిఎస్) రంగారెడ్డి జిలలాన్ల ప్రధాన కార్యదర్శి సత్తు పాండు రంగారెడ్డి అన్నారు. ఆదివారం వరంగల్ పట్టణంలో జరిగిన ఎస్‌టియుటిఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ....317 ఉత్తర్వులతో ఏర్పడ్డ ఇబ్బందులు ఆద్యయనం చేడానికి మంత్రుల ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయడం అభినందనీయమని వారు తెలిపారు. మంత్రులు సబ్ కమిటీ త్వరిగతంగా ప్రభుత్వానికి చక్కటి నివేదికను అందజేసి స్థానిక ఉపాధ్యాయులకు జరిగిన నష్టాన్ని తొలగించాలని అన్నారు. అలాగే పలు ఉపాధ్యాయుల సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, రాష్ట్ర బాధ్యులు కృష్ణా రెడ్డి, సుధాకర్, వీరమణి, భార్గవి లక్ష్మీనారాయణ, ఎఐఎస్‌టిఎఫ్ నాయకులు పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మల్లిఖార్జున స్వామి కల్యాణోత్సవ వేడుకలు


మల్లిఖార్జున స్వామి ఆలయ వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్న గ్రామనాయకులు

**ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 25, ప్రభాత వార్త:** మండలంలోని అంకుశాపూర్ గ్రామంలో శ్రీ మల్లిఖార్జున స్వామి శ్రీ రేణుక ఎల్లమ్మ కల్యాణోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఘట్‌కేసర్ మండలం అంకుశాపూర్‌లోని శ్రీ మల్లిఖార్జున స్వామి దేవాలయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా గ్రామ యాదవ సంఘం ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణోత్సవ వేడుకలు జరిగాయి. ఈ నెల 24 వ తేది నుండి మూడు రోజుల పాటు జరిగే వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం స్వామి వారి కల్యాణం ఘనంగా జరిగింది. అనంతరం అగ్నిగుండాలు, గొలుసు తెంపుట వంటి పూజా కార్యక్రమాలు జరిగాయి. పదవ తరగతి 2000 వ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. గ్రామ యాదవ సంఘం అధ్యక్షుడు పుర్రు బాలయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు మాజీ ఎంపీటీసీ కరుణాకర్, మాజీ సర్పంచ్ బద్దం అర్చన, మాజీ వార్డు సభ్యుడు అర్థ బుచ్చిరెడ్డి, బొబ్బిలి శ్రీనివాస్ రెడ్డి, యాదవ సంఘం నాయకుడు పుల్లిగల్ల మల్లేశ్, ఏలుసాని బాలకృష్ణ, బిల్ కలెక్టర్ నర్సింగ్‌రావు, టీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు చింతల గోపాల్‌రెడ్డి, బి. శ్రీకాంత్ రెడ్డి, యాదవ సంఘం సభ్యులు నాగ్గనూసి శ్రీనివాస్, పుర్రు ధర్మేందర్, పి. అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాజేందర్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి
### ఎమ్మెల్యే కాలె యాదయ్య


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**షాబాద్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేసిన దివంగతనేత పట్నం రాజేందర్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలె యాదయ్య, జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడి అన్నారు. దివంగత నేత పట్నం రాజేందర్‌రెడ్డి వర్ధంతి పురస్కరించుకుని ఆదివారం పీఆర్‌ఆర్ మినీ స్టేడియంలో జిల్లా స్థాయి క్రికెట్, వాలీబాల్ పోటీలను బీఆర్‌ఎస్ సీనియర్ నా యకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ.... మారుమూల గ్రామాల్లోని యువత క్రీడల్లో రాణించేందుకు రాజేందర్‌రెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన ఆశయం మేరకు షాబాద్‌లో పీఆర్‌ఆర్ మినీ స్టేడియం ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. గ్రామీణ యువకులు క్రీడల్లో రాణించి మండలానికి మంచిపేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. క్రీడాకారులకు మా వంతు సహాయసహకారాలు ఎప్పుడు ఉంటాయన్నారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు మద్దూరి పాండు, రమేష్‌యాదవ్, రాంచెంద్రారెడ్డి, సుదర్శన్, శివకుమార్, మాజీ సర్పంచులు దర్శన్, కృష్ణగౌడ్, చంద్రశేఖర్, జంగయ్య, క్రీడాకారులు తదితరులు ఉన్నారు.

## ఘనంగా శివపార్వతుల కళ్యాణం


శివపార్వతుల కళ్యాణంలో పాల్గొన్న గ్రామస్థులు

**షాబాద్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** శివపార్వతుల కళ్యాణం కన్నుల పండువగా ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. షాబాద్ మండల పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామంలో శ్రీ భ్రమరాంభ సహిత సంఘమేశ్వర స్వామి దేవాలయంలో భాజభజంత్రిల మధ్య వేద పండితులు శివపార్వతుల వారి కళ్యాణం ఎంతో అంగరంగా వైభవంగా నిర్వహించారు. గ్రామస్థులు తీసుకువచ్చిన తలంబ్రాలు స్వామివారికి పోయించారు. శివనామ స్మరణతో దేవాలయం మార్మోగింది. స్వామి వారి కళ్యాణం చూడడానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఈకార్యక్రమంలో గ్రామస్థులు భానూరి రాంమోహన్‌గుప్తా, జగదీశ్వర్‌గుప్తా, దండు రాముగుప్తా, రమేష్‌గుప్తా, సర్వం, హరీష్, శశాంక్, రాజు, కుమార్, ఆశోక్, సంతోష్ తదితరులు ఉన్నారు.



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న బిజెపి నాయకులు

## ముంగిలో బిజెపి గోడపత్రిక ఆవిష్కరణ

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** ఈ నెల 28వ తేదీన జరిగే విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు ఓంకార్‌యాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని ముంగి గ్రామ శివారులోని శ్రీఆదిలక్ష్మి ఆశ్రమంలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి సంకల్ప యాత్ర గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడవ మారు దేశాన్ని నరేంద్ర మోది పాలించాల్సి న అవసరం ఉందని, అందుకు రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ స్థానంపై బిజెపి జెండా ఎగిరేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల మాజీ అధ్యక్షులు ఈదుల్లపల్లి ఈరన్న, నాయకులు రాహుల్ పాలింకార్, శ్రీకాంత్, రాము, ఓనంరెడ్డి, సంతోష్‌రెడ్డి, మహేష్, పాండురంగారెడ్డి, వాసు మడివాల్, అరవింద్ చౌహాన్, శివకుమార్, దావలప్ప, నర్సింలు, నాగశెట్టి పాల్గొన్నారు.

## భజరంగ్‌దళ్ పట్టణ కార్యవర్గం ఎన్నిక



విహెచ్‌పి, భజరంగ్‌దళ్ జహీరాబాద్ పట్టణ కార్యవర్గం

**జహీరాబాద్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** జహీరాబాద్ పట్టణ విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పి), భజరంగ్‌దళ్ కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు కీరసాగర్, సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి జీవన్ జైన్‌ల ఆధ్వర్యంలో పట్టణంలోని శాంతినగర్‌లో హనుమాన్‌మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణ విహెచ్‌పి, భజరంగ్ దళ్ నూతన కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భజరంగ్ దళ్ పట్టణ అధ్యక్షులుగా గాజుల మోహన్, కార్యదర్శిగా రాజేష్, ఉపాధ్యాక్షులుగా అత్కారి జగదీష్, దశరథ్, సహాయక కార్యదర్శిగా మంగలి ప్రదీప్, ప్రవీణ్ గురు, గోరక్ష ప్రముఖ్ జంగ్టి రమేష్, విద్యార్థి ప్రముఖ్‌గా కుమ్మరి విగ్నేష్, నితీష్, విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షులుగా బొజ్జ రఘుకాంత్, శ్రీధర్, ఎక్కెలి మండల భజరంత్ దళ్ అధ్యక్షులుగా బొల్గరి ఆకాష్‌లను ఎన్నుకున్నట్లు వివరించారు.

## జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ



జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్న సిఐ, ఎస్ఐ

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 25,ప్రభాతవార్త:** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను, నాలుగు చక్రాల వాహన చోధకులు ప్రయాణంలో సీటు బెల్టును ధరించి ప్రాణాలకు రక్షణ కల్పించుకోవాల్సి న అవసరం ఉందని సీఐ రేణుక, ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. జిల్లా ఎస్‌పి డాక్టర్ డి బాలస్వామి ఆదేశాల మేరకు మండలంలోని జాతీయ రహదారిపై వాహనాల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా వాహనాలు తనిఖీ చేసి వాహనదారులకు పలు సూచనలు చేశారు. వాహనచోదకులు రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. నిబంధనలు పాటించని వాహనదారుల వాహనాలను సీజ్ ఆర్టీఏ అధికారులకు తమ వాహనాలను అప్పగించడం జరుగుతుందని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.

## ఎన్‌హెచ్‌ఆర్సీ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి



నియామక పత్రం అందుకుంటున్న యెల్లు శ్రీనివాస్‌రెడ్డి

**కొండపాక, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** అవినీతి అక్రమాలపై జాతీయ మానవ హక్కుల కమిటీ రాజీలేని పోరాటంచేస్తుందని ఎన్‌హెచ్‌ఆర్సీ సంస్థ జిల్లా అధ్యక్షుడు బద్దిపడగ నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం కుకునూరుపల్లి మండలం లకుడారం గ్రామానికి చెందిన యెల్లు శ్రీనివాస్‌రెడ్డిని కుకునూరుపల్లి ఎన్‌హెచ్‌ఆర్సీ మండల అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ ప్రొసీజర్‌తో మానవ హక్కుల ఉల్లంఘనను నిరోధిచడానికి నిస్వార్థంగా ఎన్‌హెచ్‌ఆర్సీ సంస్థ పని చేస్తుందన్నారు. అనంతరం అధ్యక్షుడిగా నియామకమైన శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు జాతీయ అధ్యక్షుడు యాసిన్, రాష్ట్ర అధ్యక్షుడు బద్దిపడగ క్షనివాస్‌రెడ్డి, కొమురవెల్లి మండల అధ్యక్షుడు బోడుగం కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షునికి, కొండపాక మండల అధ్యక్షుడు పాలడుగు బాల్‌రెడ్డికి అయన కృతజ్ఞతలు తెలిపారు.

## నంది అవార్డు రావడం సంతోషంగా ఉంది : బాలకృష్ణ

**కొండపాక, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** తెలుగువెలుగు సాహితి అకాడమీ జాతీయ పురస్కారాన్ని సోమవారం వరంగల్ ఎన్‌జిఒ భవన్‌లో కోఆర్డినేటర్లు డాక్టర్ మోహన్‌రావు, రాజ్‌కుమార్‌చారి చేతుల మీదుగా తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బూరుగోజు బాలకృష్ణమచారికి నంది అవార్డు ప్రదానం చేయడం జరిగిందని అయన తెలిపారు. పరిణయ పరిచయ వేదికలో వందల సంఖ్యలో వివాహాలను, గృహ ప్రవేశాలను, వాస్తు, పురోహితము చేసినందుకు అవార్డు లభించిందని తెలిపారు. అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ మల్లమారి రవీందర్ మాజీ ఉప సర్పంచ్, వంగ శ్రీనివాస్ గౌడ్, వార్డు సభ్యులు డాక్టర్ కనక సేన, యాదగిరి గౌడ్, గ్రామస్తులు జి. నర్సింహారెడ్డి, అలకుంట రాజయ్య, ఎలుపల్లి నర్సింలు, తదితరులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.



బూరుగోజు బాలకృష్ణకు సన్మానిస్తున్న గ్రామస్తులు

# భక్తులతో కిటకిటలాడిన తునికి శ్రీనల్ల పోచమ్మ ఆలయం

**కొడిపల్లి, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** తునికి శ్రీనల్ల పోచమ్మ ఆలయం అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరువు నియోజక వర్గ నేత నీలం మధు హామి ఇచ్చారు. అది వారం తునికి శ్రీనల్ల పోచమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శ్రీనల్ల పోచమ్మ తల్లి తాను కోరిన కోరిక తీర్చినందుకుగాను మొక్కులు చెల్లించుకున్నట్లు నీలం మధు తెలిపారు. కాగా ఉదయం నుంచి ఆలయం వద్ద భక్తులతో సందడిగా మారింది. ఆది వారం సెలవు దినం ఉన్నందున ఉదయం నుండి పలువురు ప్రభుత్వ ఉద్యోగులు కుటుంబ సమేతం తునికి శ్రీనల్ల పోచమ్మ ఆలయానికి పెద్దఎత్తున తరలివస్తున్నారు. ఈఓ మోహన్‌రెడ్డి, చైర్మెన్ తాళ్ల గోపాల్ రెడ్డి, ప్రధాన అర్చకులు శివప్పలు శ్రీనల్ల పోచమ్మ అమ్మవారికి పంచామృతాభిషేకం చేసి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, కుంకుమార్చనచేసిన తర్వాత భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు ఒడి బియ్యం పోసి, పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకన్నారు. ఆలయానికి విచ్చేసిన కాంగ్రెస్‌నేత నీలం మధును ఈఓ మోహన్‌రెడ్డి, అర్చకులు శాలువా కప్పి సన్మానించారు. భక్తులు శివసత్తుల విన్యాసాల నడుమ బోనాలను డప్పు చప్పుళ్లతో ఆలయం చుట్టూ ఊరేగించి, అమ్మవారికి సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈఓ బి. మోహన్‌రెడ్డి సిబ్బంది సహకారంతో గర్భ గుడిలోకి భక్తులకు దర్శనం కల్పించారు.

అలాగే భక్తులకు ఎలాంటి ఆసౌకర్యాలు కలగకుండా ఈఓ చర్యలు తీసుకున్నారు. ఆలయ అభివృద్ధికి గాను దాతలు స్వచ్ఛందంగా విరాళాలు సమర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార క్రమంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులు, ఆలయం జూనియర్ అసిస్టెంట్ వెంకట్ రెడ్డి, ఆలయ ప్రధాన ఆర్చకులు శివప్ప, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



తునికి శ్రీ నల్ల పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకుంటున్న కాంగ్రెస్ సినియర్ నేత నీలం మధు



ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అశోక్‌గౌడ్

## 1వ వార్డులో పర్యటించిన మున్సిపల్ చైర్మన్

**నర్సాపూర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు హన్మంతాపూం లో ఆదివారం మున్సిపల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్ పర్యటించారు. ఈ మేరకు పలు అభివృద్ధి పనలను ఆయన పరిశీలించారు.గ్రామంలో ప్రారంభోత్స వానికి సిద్ధంగాఉన్న మహిళా సమాఖ్య భవనాన్ని, ఉచిత వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఇంకా ఏమైనా పనుల మిగిలి ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు అదేవిదంగా గ్రామంలోని వాడవాడల్లో తిరిగి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా మున్సిపల్ చైర్మెన్ అశోక్‌గౌడ్ మాట్లాడుతూ ప్రారంబానికి సిద్ధంగా ఉన్న మహిళా సమాఖ్య భవనం, ఉచిత వాటర్ ప్లాంట్ ను త్వరలోనే ప్రారంబించి వాడుకలోకి తీసుకువస్తామన్నారు. అదేవిదంగా గ్రామంలో పెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ వెంట మున్సిఫల్ అదికారులు, సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## లింగాపూర్‌లో క్లబ్ హౌస్ ప్రారంభం

**నర్సాపూర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** మండల పరిధిలోని లింగాపూర్ గ్రామంలో శ్రీనివాస్‌గౌడ్ పామ్ హౌస్ లో నూతనంగా నిర్మించిన క్లబ్ హౌస్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి, మాజీ జడ్పిటీసి శ్రీనివాస్‌గుప్త లతో పాటు కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు, చేసి, కొబ్బరి కాయలు కొట్టి ప్రారంబించారు. అంతకు ముందు లింగాపూర్‌లో జరుగుతున్న శ్రీ గంధభేరుండ లక్ష్మినర్సింహ్మాస్వామి జాతరలో పాల్గొని శ్రీలక్ష్మినర్సింహ్మాస్వామికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఈ క్లబ్ హౌస్‌ను ప్రారంబించడం జరిగింది. ఈకార్యక్రమంలో క్లబ్ మౌస్ యజమాని చెంది శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు కాంగ్రెస్ మండల అధ్యక్షులు మల్లేషం,కాంగ్రెస్ పార్టీ బిసి సెల్ మండల అధ్యక్షులు రెడ్డిపల్లి అశోక్‌గౌడ్, నాయకులు సురేశ్‌నాయక్, వర్కింగ్ ప్రసిడెంట్ ఉదయ్‌కుమార్, కిషన్‌నాయక్, అల్తాఫ్,లింగాపూర్ ఆంజనేయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మోదీ నాయకత్వంలోనే దేశం అభివృద్ధి

### ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, మధ్యప్రదేశ్ ఇన్‌ఛార్జి మురళీధర్‌రావు

**కీసర, ఫిబ్రవరి 25,ప్రభాతవార్త:** మోదీ నాయకత్వం లోనే ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి,మధ్య ప్రదేశ్ ఇంఛార్జి మురళీదర్ రావు అన్నారు. ఆదివారం బిజెపి పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు పట్లోళ్ల విక్రంరెడ్డి ఆధ్వర్యంలో "విజయసంకల్ప యాత్ర" జవహర్‌నగర్ ఫైరింగ్ రేంజ్ కమాన్ నుండి ప్రారంభమై దమ్మాయిగూడ చౌరస్తా,నాగారం, రాంపల్లిచౌరస్తా, బండ్లగూడ, చీర్యాల చౌరస్తా నుండి యాత్ర ప్రారంభమై ఔటర్ రింగ్ రోడ్డు వరకు కొనసాగింది.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ మోదీ ప్రధానిగా పగ్గాలు చేపట్టాక దేశంలో సమూల మార్పులు తీసుకొచ్చారని పేర్కొన్నారు. టాయిలెట్లు నిర్మించి మహిళల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిం దని అన్నారు.కరోనా సమయంలో దేశ ప్రజలకు మోదీ అండగా నిలిచా రని పేర్కొన్నారు.మోదీని మూడోసారి ప్రధానిగా ఆశీర్వదించేందకు ప్రజ లు సిద్దంగా ఉన్నారని పేర్కొన్నారు.రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో 17 ఎంపీ స్దానాలను గెలిపించి నరేంద్ర మోదీని మూ డోసారి ప్రధాన మంత్రిని చేయాలని పిలుపునిచ్చారు.అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించిందని,పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి గుణపారం చెప్పాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ ప్రకటించిన హామీల్లో ఇప్పటివరకు ఏ ఒక్కటీ చేయలేదన్నారు.ఆర్టీసి బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ఒక్కటే అమలు చేసిందని,అయితే ప్రయాణికుల రద్దీకి తగ్గట్టు బస్సులను పెంచటంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.గతంలో పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్,కాంగ్రెస్ పార్టీలు రెండు కుటుంబ పార్టీలేనని,బిఆర్ఎస్ కాంగ్రెస్ అంటేనే కబ్జాలు,దోపిడీలకు పాలదుతాయని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణ పాఠం తప్పదని వ్యాఖ్యనించారు.రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,ఘట్‌కేసర్ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి,మేడ్చల్ రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా తిరుమల్‌రెడ్డి,మేడ్చల్ అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా బిజెపి అధికార ప్రతినిధి గాలి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు కృషి

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** విద్యుత్ సమస్యలను పరిష్కరించి వినియోగదారులకు మెరుగైన కరెంట్ సరఫరాను అందించేందుకు కృషి చేస్తున్నామని ఘట్‌కేసర్ ఏఈ సతీష్‌కు మార్ తెలిపారు. కరెంట్ సరఫరాలో లోపాలు, ట్రాన్స్ ఫార్మ ర్లలో ఫూజులు వేయడం, అత్యవసర పరిస్థితిలో లైన్ స్పాపిం గ్, స్తంభాల ధ్వతంస ం, డిటిఆర్ ఫైర్ క్యాచింగ్ వంటి సమస్య లు ఉత్పన్నమైనప్పుడు నిర్ణిత సిబ్బంది అందుబాటులో ఉంటా రని తగిన సమాచారం ఇస్తే స్పందించి చర్యలు తీసుకుం టామని తెలిపారు. ఉపకేంద్రం ఏఈ సతీష్‌కుమార్ (94408 13178), సబ్‌ఇంజనీర్ ప్రసన్న అంజనేయులు (9963929291,) సీనియర్ లైన్‌ఇన్‌స్పెక్టర్ సి.ప్రతాప్‌రెడ్డి(939115 6732)కి సంబంధించి ఘట్‌కేసర్ టౌన్, ఎన్‌ఎఫ్‌సీనగర్, ఎదులాబాద్, చందుపట్లగూడ, బొక్కోనిగూడ, మర్రిపల్లిగూడ, అవుషాపూర్, అంకుశాపూర్, మాదారం గ్రామాల్లో సమస్యలు తెలియజేయాలన్నారు. లైన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.నర్సయ్య (94416 97668) బాలాజీనగర్, కొండాపూర్, పదమటిసా యిగూడ, యంనంపేట్, ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, ఘణాపూర్, ఫకీర్‌టె క్యా, లింగాపూర్, జెఎల్‌ఎం ఎ.రవికుమార్ (63003 98906) బాలాజీనగర్, కొండాపూర్, పదమటిసాయిగూడ, జెఎల్‌ఎం జి.వినోద్‌కుమార్ (9704110202) ఘట్‌కేసర్ పట్టణం, జెఎల్‌ఎం ఎండి.హాకీం (9182184588) ఘట్‌కేసర్ పట్టణం, జెఎల్‌ఎం ఎం.పవన్‌కుమార్ (7674014029) ఎన్‌ఎఫ్‌సీనగర్, చందుపట్లగూడ, బొక్కోనిగూడ, జెఎల్‌ఎం జి.శివకుమార్ (9959866985) అవుషాపూర్, అంకుశాపూర్, మాదారం, జెఎల్‌ఎం వై.విక్రమ్(9052511651) అవుషాపూర్, అంకుశాపూర్, మాదారం, జెఎల్‌ఎం పి.శ్రావణ్‌కుమార్ (944 1008501) యంనంపేట్, ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, ఘణా పూర్, ఫకీర్‌టెక్యా, ఆర్టిజెన్ ఆర్.పెంటయ్య (9849674972) ఎదులాబాద్, మర్రిపల్లిగూడ, కొత్తగూడ, పోతరాజ్‌గూడ, ఆర్టిజెన్ బి.రవికుమార్ (9701891610) బాలాజీనగర్, కొండాపూర్, పదమటిసాయిగూడ, ఆర్టిజెన్ బి.శ్రీను (97001 40644) ఘట్‌కేసర్ పట్టణం, ఆర్టిజెన్ ఎం.జంగయ్య (9912607940) యంనంపేట్,ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, ఘణాపూర్, ఫకీర్‌టెక్యా,ఆర్టిజెన్ ఎట్టయ్య (9885838407) ఎదులాబాద్, మ ర్రిపల్లిగూడ, కొత్తగూడ, పోతరాజ్‌గూడలకు సం బంధించి విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు అందుబా టులో ఉంటారని సమాచారం అందించాలని ఏఈ సతీష్‌కు మార్ సూచించారు.



కల్యాణ మండపం ప్రారంభోత్స వ దృశ్యం

## ఘనంగా గండబేరుండ లక్ష్మీనర్సింహస్వామి జాతర ఉత్సవాలు

### గుమ్మడమ్మ వద్ద బండ్ల ఊరేగింపు, అగ్నిగుండాలు

**నర్సాపూర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** మండల పరిధిలోని లింగాపూర్ గ్రామంలో రెండు రోజులుగా గంధ బేరుంధ శ్రీ లక్ష్మినర్సింహస్వామి జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈమేరకు శ్రీలక్ష్మినర్సింహస్వామి కల్యాణం కనుల పండుగగా జరిగింది. అంతేగాక గుమ్మడమ్మ దేవతా ఆలయం వద్ద బండ్లను ఊరేగించారు.అనంతరం అగ్నిగుండాలను నిర్వహించారు. ఈ సందర్బంగా గ్రామస్తులు శ్రీ లక్ష్మినర్సింహ్మాస్వామి కి నియమనిష్టలతో, భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవుడికి పావలు తీయడం జరిగింది. ఈ జాతర ఉత్సవాల్లో ఇదే గ్రామానికి చెందిన చెంది శ్రీనివాస్‌గౌడ్ తన స్వంత నిధులతో నూతనంగా కల్యాణ మండపాన్ని నిర్మించారు. ఈ కళ్యాణ మండపాన్ని ఎమ్మెల్యే సునీతారెడ్డి చేతుల మీదుగా ప్రారంబించారు.శ్రీ లక్ష్మినర్సింహ్మాస్వామి ఆలయం వద్ద చెంది శ్రీనివాస్‌గౌడ్ నూనతంగా కళ్యాణ మండపం నిర్మించడం వల్ల గ్రామస్తులకు, ప్రజలకు వివాహాలు చేసుకోవడానికి, విందులు వినోదాలు చేసుకోవడానికి ఎంతో సౌకర్యంకలుగుతుందని పలువురు అబిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్బంగా చెంది శ్రీనివాస్‌గౌడ్ ను పలువురు అబినందించారు. అనంతరం ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. అంతేగాక కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి, మాజీ ఎంపిటీసి శ్రీనివాస్‌గుప్త,గ్రామ మాజీ సర్పంచ్ ఉప్పలపు అశోక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు ఈ జాతరలో పరిసరా గ్రామాల ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ లక్ష్మినర్సింహ్మాస్వామిని దర్శించుకుని ఆయన కృపకు పాత్రులయ్యారు.

## హెడ్ కానిస్టేబుల్ తిరుపతి మృతి

### సంతాపం వ్యక్తం చేసిన పోలీసు అధికారులు, సిబ్బంది

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** సిద్దిపేట పోలీసు కమిషనరేట్‌లోని స్పెషల్ బ్రాంచ్‌లో పని చేస్తున్న గోవిందారం తిరుపతి హెడ్ కానిస్టేబుల్ అనారోగ్యానికి గురై సికింద్రాబాద్ యశోద అనుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం చనిపోయారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కాగా సీపీ డా॥అనురాధ బాధిత కుటుంబీకులను ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. హెడ్ కానిస్టేబుల్ అకాల మరణానికి సంతాపం వ్యక్తం చేసి కుటుంబీకులను ఓదార్చారు. పోలీసుశాఖ తరపున రావాల్సి న అన్ని బెనిఫిట్స్ త్వరలోనే కుటుంబ సభ్యులకు అందజేస్తామని తెలిపారు. అంత్యక్రియల నిమిత్తం ప్రభుత్వం తరుపున రూ.20 వేలు అందించారు. ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్‌చంద్రబోస్, ఎస్‌బి సీఐ సత్యనారాయణరెడ్డి, ఎస్ఐలు పరుశురామ్, గంగరాజు, భువనేశ్వర్, బాలకృష్ణ, పోలీసు అధికారులు, సిబ్బంది తిరుపతి స్వస్థలం మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామానికి వెళ్లి మృతదేహంపై పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు.

## ఆధునిక సాంకేతికతతో నూతన ఆవిష్కరణలు

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** విద్యార్థులు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని కొత్త ఆవిష్కరణలపై దృష్టి సారించాలని మైక్రోసాఫ్ట్ సీనియర్ విశ్లేషకుడు మణికాంత్ అన్నారు. ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయంలో గత రెండురోజులుగా నిర్వహిస్తున్న దక్ష 3.0 కార్యక్రమం ముగిసింది. ఏయూ ఆధ్వర్య ంలో నిర్వహించిన జాతీయ స్థాయి సాం కేతిక, సాంస్కృతి ఉత్స వంలో దేశంలోని 175 కళాశాలల నుంచి దాదాపు 5,000 మంది విద్యార్థులు ఈవెంట్లతో ఉత్సాహంగా పాల్గొన్నారు. దక్ష 3.0 ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా మైక్రోసాఫ్ విశ్లేషకుడు మణికాంత్, గౌరవ అతిధిగా అగ్రిటెక్, హెల్త్‌టెక్ డొమైన్ నిపుణుడు హను యెడ్లూరిలు పాల్గొని మాట్లాడారు. జీవితంతో విజయం సాధించాలంటే వైఫల్యాలను పాఠాలుగా తీసుకోవాలని పేర్కొన్నారు. టెక్నో ఫెస్టోలతో విద్యార్థులకు కొత్త ఆలోచనలు నేర్చుకునేందుకు అన్వేశిం చడానికి దోహద పడుతుందన్నారు. ఈసందర భంగా వివిధ అంశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. సీఎస్ఈ డీన్ డాక్టర్ జి.విష్ణుమూర్తి, అడ్మిషన్స్ డీన్ డాక్టర్ మహిపతి శ్రీనివాస్‌రావులు దక్ష 3.0 కన్వీనర్ పి.రాజశేఖర్, కోకన్వీనర్లు బి.రవీందర్‌రెడ్డి, స్వప్నగౌడ్‌లను సన్మానించి అభినందించారు.

## ముగిసిన బండెల ఎల్లమ్మ జాతర ఉత్సవాలు

### భక్తుల కోలాహలం మధ్య అమ్మవారి పల్లకి సేవా

**కొడంగల్,ఫిబ్రవరి 25ప్రభాతవార్త**

ప్రజలు ఆరాధ్య దైవంగా కొలిచే బండెల ఎల్లమ్మ జాతర ఉత్స వాలు భక్తుల కొలహలం మధ్య అమ్మవారి పల్లకిసేవా,పెరుగు బసంతం కార్యక్రమంతో ముగిశాయి.ఈనెల 23నుంచి ప్రారంభమైన జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మొదటి రోజు అమ్మవారి రధోత్స వం,రెండవ రోజు శనివారం కాడెద్దుల బండ్ల ఊరేగింపుతో పాటు చివరి రోజు ఆదివారం అమ్మవారి పల్లకి సేవా,పెరుగు బసంతం కార్యక్రమాలు వైభవంగా కొనసాగాయి. ఈ సందర్బంగా ఆలయంలో అమ్మవారికి విశేష అలం కరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ప్రత్యేక అలం కరణలతో అమ్మవారిని పల్లకిలో ఆలయం చుట్టు ఊరేగిస్తు పెరుగుబ సంతం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్బంగా పలువురు మహిళలు అమ్మవారి పల్లకి సేవ ముం దు పూనకంతో ఊగిపోయారు. పెరుగుబసంతం కార్యక్రమంలో భాగంగా ఉట్టికొట్టడంతో భక్తులు అమ్మవారిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు.మూడు రోజుల పాటు కొనసా గిన బండెల ఎల్లమ్మ జాతర ఉత్సవాలకు కొడంగల్‌తో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరా వడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.ఈ సం దర్బంగా జాతర ఉత్సవాలకు తరలివచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాతర ఉత్సవాల కమిటీ నిర్వహకులు తగు ఏర్పాట్లు చేశారు.అలాగే పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు.

## 34 మందికి కళ్యాణలక్ష్మి చెక్కులు అందజేత

**నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 34 మందికి కళ్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఆదివారం అందచేశారు. నారాయణఖేడ్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లబ్దిదారులకు చెక్కులు అందించారు. ఈ సంరద్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడతని పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు గుండేరావు, సంతోష్, అంబాజీ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానానికి రూ. ఐదువేల విరాళం

**హుస్నాబాద్, ఫిబ్రవరి 25,ప్రభాతవార్త :** మండలంలోని పందిల్ల గ్రామంలో శ్రీ మహాలింగేశ్వర స్వామి దేవాలయంలో వచ్చే మహాశివరాత్రి రోజున అన్నదానం కార్యక్రమానికి అదే గ్రామానికి చెందిన అలుమల్ల అరుణ నారాయణరెడ్డి తమ వంతు సహకారంగా రూ 5,116 ఆలయ కమిటీకి ఆదివారం అందించినట్లు ఆ గ్రామ తాజా మాజీ సర్పంచ్ తోడేటి రమేష్ తెలిపారు. అంతే కాకుండా చిగురుమామిడి మండలంలోని నావాబుపేట గ్రామానికి చెందిన నీరజసంపత్‌రెడ్డిలు ఒక క్వింటాలు బియ్యం, పందిల్ల గ్రామానికి చెందిన వేముల సుజాతశ్రీనివాస్‌లు 25కిలోల బియ్యం అందించారని ఇంకా దాతలు ఎవరైనాఉంటే ముందుకు వచ్చి ఆలయ నిర్మాణంతోపాటు మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.

## ఎఫ్‌టిఎల్‌లో నిర్మాణాలు చేపడితే చర్యలు

### తహసీల్దార్ పర్వీన్ షేక్



చింతల్‌చెరులో ఎఫ్‌టిఎల్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ పర్వీన్ షేక్

**హత్నూర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** ఎఫ్‌టిఎల్‌లో నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని తహసీల్దార్ పర్వీన్ షేక్ హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలోని చింతల్‌చెరు గ్రామ పరిధిలోని జల్లికుంట, తుర్కల కుంటలను తహసీల్దార్ పరిశీలించారు. జల్లికుంట ఎఫ్‌టిఎల్‌లో చేపట్టిన నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నించారు. అనుమతులు లేనిదే నిర్మాణాలు ఎలా చేపట్టారని నిలదీశారు. నిర్మాణానికి ఆధారాలు ఉంటే కార్యాలయంలో అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, సర్వేయర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## మూఢనమ్మకాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



దామరకుంటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మధుకర్‌రెడ్డి

**మర్కుక్, ఫిబ్రవరి 25 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని దామరకుంటలో శనివారం రాత్రి మర్కుక్ ఎస్ఐ మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు కళాబృందం వారు మూఢనమ్మకాలు, ట్రాఫిక్‌నిబంధనలపై ఎల్ఈడీ స్క్రీన్, పాటలు, మాటల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మూఢనమ్మకాలు, మంత్రాలు తంత్రాలు, సామాజిక రుక్మతల గురించి ఎవరూ నమ్మవద్దని పేర్కొన్నారు. ప్రజలకు అర్థమయ్యేవిధంగా ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా మంత్ర తంత్రాలపై అవగాహన కల్పించామని పేర్కొన్నారు. ప్రస్తుత టెక్నాలజీ ప్రపంచంలో మూఢనమ్మకాలు భానామతి, చేతబడి లాంటి మంత్రాలను ఎవరూ నమ్మవద్దని సూచించారు. గ్రామాల్లో చిన్న చిన్నతగాదాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దని, ఏమైనా తప్పొ ప్పులు ఉంటే కలిసిమెలిసి పరిష్కరించుకొని కలిసి ఉండాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ తప్పనిసరిగా ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడుపరాదని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు కలిగినా 100కు లేదా సిద్దిపేట పోలీస్ కంట్రోల్ నెం.8712667100 నెంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్, మాజీ సర్పంచ్ గాయత్రి బాల్‌నర్సయ్య, మాజీ ఉపసర్పంచ్ అంజయ్య, పోలీస్ కళాబృందం సభ్యులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 5వ రోజూ కొనసాగిన భక్తుల పాదయాత్ర

**కొల్చారం, ఫిబ్రవరి 25,ప్రభాతవార్త:** శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయానికి అత్యంత భక్తిశ్రద్ధలతో 5వ రోజు కాలినడకన పాదయాత్ర సాగుతుందని కొల్చారం మండల పరిధిలోని తుక్కపూర్ గ్రామానికి చెందిన శివస్వామి శివప్పగారి శ్రీశైలం తెలిపారు. ఆదివారం నాటికి కాలినడకన చేపట్టిన పాదయాత్ర షాద్‌నగర్ చేరుకుందని తెలిపారు. ఈ నెల 21న కొల్చారం మండల పరిధిలోని తుక్కాపూర్ గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వమించి పాదయాత్రగా బయలుదేరారు. మార్చి 3వ తేది వరకు సుమారు 320 కిలోమీటర్ల కాలినడకన పాదయాత్ర చేపట్టి శ్రీశైలంలోని మల్లిఖార్జున స్వామిని దర్శించుకుంటామని శివ స్వామి శ్రీశైలం తెలిపారు.

## ఉత్తమ విద్యకు చిరునామ ది మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థలు

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 25,ప్రభాతవార్త:** ఉత్తమ విద్యకు చిరునామా ది మాస్టర్ మైండ్ విద్యా సంస్థలు అని చైర్మన్ రాజు సంఘాని తెలిపారు. పటాన్‌చెరు మండలం ఇంద్రేశంగ్రామంలో శనివారం సాయంత్రం ది మాస్టర్ మైండ్స్ స్కూల్‌లో శనివారం సాయంత్రం డైరెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా యాన్యువల్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన చైర్మన్ రాజు సంఘాని మాట్లాడుతూ విద్యార్థులకు ఎప్పటికప్పుడు విద్యను అందిస్తూ 50 బ్రాంచీలకు పైగా ది మాస్టర్ మైండ్స్ స్కూల్స్ నడుపుతున్నట్లు పేర్కొన్నారు. కాగా యాన్యువల్ డే సందర్భంగా కలర్‌ఫుల్ లైటింగ్‌లో విద్యార్థిని, విద్యార్థులు చేసిన డ్యాన్సులు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో ఇంద్రేశం మాజీ సర్పంచులు నర్సింలు, రామేశ్వర బండ సర్పంచి అంతిరెడ్డి గారి ధరణి అంతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ అంతిరెడ్డి గారి అంతిరెడ్డి, స్కూల్ డైరెక్టర్లు నాగరాజ, శివనాయక్, రామక్రిష్ణ, ప్రిన్సిపల్ దీప ప్రవీణ్, టీచర్లు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అలయన్స్ క్లబ్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :**

అలయన్స్ క్లబ్ ద్వారా సమాజంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని అలయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ సోమ వనజ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అమె మాట్లాడారు.తమ పరిధిలో 16 క్లబ్‌లు చేస్తున్న సేవలను అభినందిస్తూ ఈనెల 27న వనమాలి విజయోత్సవ కార్యక్రమంలో అవార్డులు అందించడం జరుగుతుందన్నారు. అలయన్స్ క్లబ్‌ల అధ్వర్యంలో పేద అడపిల్లల వివాహాలు జరిపించడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సైన్స్ క్విజ్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పేద విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీతో పాటు పేద వధువులకు పుస్తెమట్టెలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు అత్మరాములు, వైకుంతం,అంతయ్య, అంజనేయులు, శివకుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అలయన్స్ క్లబ్ నాయకులు